E-KABURU E-PAPER

# ఈ-కబురు

ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం

@ekaburu.com

(తేదీ) 01-08-2025 (వారం) శుక్రవారం హైదరాబాద్ పేజీలు–6 e-kaburu.com



కదం తొక్కుతున్న కృష్ణమ్మ » 3లో

## ఉప ఎన్నికలొస్తాయి సిద్ధం కండి



» పార్టీ శ్రేణులకు కేటీఆర్ పిలుపు.. సుప్రీం తీర్పుపై హర్షం
» కాంగ్రెస్ రాజకీయానికి తీర్పు చెంపపెట్టని వ్యాఖ్య
» ఫిరాయింపు ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలని స్పీకర్‌ను కోరతారా రాహుల్?: హరీశ్‌రావు

ఈ కబురు ,హైదరాబాద్: పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై స్పీకర్ మూడు నెలల్లోగా చర్యలు తీసుకోవాంటూ సుప్రీం కోర్టు గురువారం ఇచ్చిన తీర్పుపై బీఆర్ఎస్ వర్గాలు హర్షం వ్యక్తం చేశాయి. సుప్రీం తీర్పు కాంగ్రెస్ పార్టీకి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి చెంపదెబ్బ అని

తరువాయి 2లో

## ఆగస్టు 2న పీఎం కిసాన్ నిధులు విడుదల



ఈ కబురు: రైతులకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త తెలిపింది. ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ పథకం నిధులను ఆగస్టు 2న రైతుల ఖాతాల్లో జమ చేయనున్నట్టు కేంద్రం ప్రకటించింది. » 2లో

# మూడు నెలల్లోపు నిర్ణయం తీసుకోవాలి

» పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల విషయంలో నిర్ణయం తీసుకోండి
» తెలంగాణ స్పీకర్ కార్యాలయానికి సుప్రీంకోర్టు ఆదేశాలు
» అనర్హతలపై నిర్ణయాధికారం స్పీకర్‌దేనని స్పష్టీకరణ
» అలాగని తామెలాంటి ఆదేశాలూ ఇవ్వకపోతే 'ఆపరేషన్ సక్సెస్.. పేషెంట్ డెడ్' అన్నట్టవుతుందని వ్యాఖ్య
» అనర్హతల విషయంలో స్పీకర్‌కు న్న నిర్ణయాధికారాన్ని పార్లమెంట్ పునఃపరిశీలించాలని సూచన




ఈ కబురు ,న్యూఢిల్లీ: పార్టీ ఫిరాయింపులు అడ్డుకోకపోతే ప్రజాస్వామ్య పునాదులకే ముప్పంటూఆందోళన.... స్పీకర్ నిర్ణయాు న్యాయ సమీక్షకు పూర్తిగా అతీతం కాదన్న సర్వోన్నత న్యాయస్థానం స్పీకర్ ట్రిబ్యునల్‌గా వ్యవహరిస్తున్నప్పటికీ రాజ్యాంగపరమైన రక్షణ పొందలేరని వెల్లడి హైకోర్టు డివిజన్ బెంచ్ తీర్పు కొట్టివేత బీఆర్ఎస్ ఎమ్మెల్యేల పిటిషన్లపై సీజేఐ బీఆర్ గవాయ్, జస్టిస్ అగస్టీన్ జార్జ్ మసీహ్‌ల ధర్మాసనం తుది తీర్పు: పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల అనర్హతపై నిర్ణయం తీసుకునే అధికారం శాసనసభ స్పీకర్‌కే ఉందని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. తెలంగాణలో పార్టీ మారి అనర్హత పిటిషన్లు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేల విషయంలో తీర్పు వెలువరించిన రోజు నుంచి మూడు నెలల్లోగా నిర్ణయం తీసుకోవాలంటూ సభాపతి కార్యాలయానికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. అనర్హత పిటిషన్లు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేలు ఎవరూ విచారణను ఆలస్యం చేయడాన్ని అనుమతించకూడదని పేర్కొంది. విచారణను ఆలస్యం చేసేందుకు ఎమ్మెల్యేలు ప్రయత్నిస్తే తీవ్రంగా పరిగణించాలని చెప్పింది. మరోవైపు అనర్హత విషయంలో స్పీకర్ నిర్ణయాధికారాన్ని పార్లమెంట్ పునః పరిశీలించాలని సూచించింది. ఈ మేరకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ అగస్టీన్ జార్జ్ మసీహ్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం తీర్పు ఇచ్చింది. ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై తెలంగాణ హైకోర్టు డివిజన్ బెంచ్ ఇచ్చిన తీర్పును కొట్టివేసింది. ఏడు నెలలు.. 9 సార్లు విచారణ పార్టీ ఫిరాయించిన 10 మంది ఎమ్మెల్యేలపై త్వరగా చర్యలు తీసుకునేలా స్పీకర్‌ను ఆదేశించాలని కోరుతూ ఈ ఏడాది జనవరి 15న బీఆర్ఎస్ పార్టీ సుప్రీంకోర్టును ఆశ్రయించింది.

తరువాయి 2లో

## వ్యక్తుల ఇష్టాల ప్రకారం కాళేశ్వరం పనులు!

» నిర్మాణ పనుల్లో ఎన్నెన్నో వైఫల్యాలు
» ఉన్నత స్థాయిలో ఒత్తిడులకు లొంగి నిబంధనలకు విరుద్ధంగా నిర్ణయాలు
» ఆర్థిక అవకతవకలు కూడా జరిగాయ్
» లోపాలను ఎత్తిచూపిన జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్!
» ప్రభుత్వానికి నివేదిక అందజేత



తరువాయి 2లో

చరిత్ర సృష్టించిన శుభ్‌మన్ గిల్..» 6లో

ఆల్‌టైమ్ రికార్డు బద్దలు




పాపం.. ఊర్వశి.. మ్యాచ్ కోసం వెళ్తే రూ.70 లక్షలు లాస్! » 5లో



నష్టాల్లో ముగిసిన మార్కెట్లు » 4లో



## ఫిరాయింపు ఎమ్మెల్సీలపైనా సుప్రీంకోర్టుకు: కేసీఆర్



» ఎమ్మెల్యేల అనర్హత తీర్పుపై అధ్యయనం
» భారత రాష్ట్ర సమితి నేతలతో కేసీఆర్

తరువాయి 2లో



రష్యా, భారత్‌లపై నోరు పారేసుకున్న ట్రంప్ » 3లో

## కబ్జా స్థలాల్ని స్వాధీనం చేసుకుంటాం

» హైదరాబాద్‌లో 131 ఎకరాల ఇరిగేషన్ భూముల కబ్జా
» వాటి స్వాధీనానికి ఇరిగేషన్, హైడ్రా, రెవెన్యూ శాఖలు కలిసి పనిచేయాలి
» క్వార్టర్లలో అక్రమంగా తిష్టవేసిన వారినీ ఖాళీ చేయించాలి
» ప్రాజెక్టుల స్థలాల్లో సౌరవిద్యుత్ ప్లాంట్ల ఏర్పాటును పరిశీలించాలి
» నీటిపారుదల శాఖ భూముల పరిరక్షణపై సమీక్షలో మంత్రి ఉత్తమ్



తరువాయి 2లో

## అనుమతులు తీసుకునే కాళేశ్వరం



» తెలంగాణకో నీతి.. మాకో నీతా?
» సముద్రంలో కలిసే వృథా జలాలను బనకచర్లకు వాడుకుంటే తప్పేంటి?
» తెలంగాణకు వచ్చే నష్టమేంటి?
» బనకచర్లపై లోకేశ్ ప్రశ్న

తరువాయి 2లో



ట్రంప్ నిజం మాట్లాడినందుకు సంతోషిస్తున్నా: రాహుల్ » 3లో

## బీసీ రిజర్వేషన్ల సాధనకు కలిసి రండి » 3లో



» మాట్లాడుతున్న మీనాక్షి నటరాజన్. చిత్రంలో మహేశ్‌కుమార్‌గౌడ్, శ్రీధర్‌బాబు, కొండా సురేఖ, మల్‌రెడ్డి రంగారెడ్డి తదితరులు
» ప్రజల కోసమేజనహిత పాదయాత్ర
» కాంగ్రెస్ రాష్ట్ర ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్
» వచ్చే రెండేళ్లలో 35 వేలఉద్యోగాల భర్తీ: పీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్
» పరిగిలో మహాజన పాదయాత్ర



## సవరణపై సభా సమరం » 3లో

మొదటి పేజీ తరువాయి

# మూడు నెలల్లోపు నిర్ణయం తీసుకోవాలి



పార్టీ ఫిరాయించిన 10 మంది ఎమ్మెల్యేలపై త్వరగా చర్యలు తీసుకునేలా స్పీకర్‌ను ఆదేశించాలని కోరుతూ ఈ ఏడాది జనవరి 15న బీఆర్ఎస్ పార్టీ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. పార్టీ మారిన ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావ్, దానం నాగేందర్‌లపై బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, కేపీ వివేకానంద్‌లు స్పెషల్ లీవ్ పిటిషన్ (ఎస్ఎల్పి) దాఖలు చేశారు. మిగిలిన ఏడుగురు ఫిరాయింపు ఎమ్మెల్యేలు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఎం.సంజయ్‌కుమార్, కాలె యాదయ్య, బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, ప్రకాశ్‌గౌడ్, గూడెం మహిపాల్ రెడ్డి, అరికెపూడి గాంధీలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, తదితరులు రిట్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్లు దాఖలైన తర్వాత దాదాపు ఏడు నెలల్లో తొమ్మిది సార్లు సుప్రీంకోర్టు విచారణ జరిపింది. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాదులు ఆర్యమ సుందరం, మోహిత్ రావు, స్పీకర్ తరపున సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ, తదితరులు వాదనలు వినిపించారు. గత ఏప్రిల్ 3న విచారణ ముగించి తీర్పు రిజర్వ్ చేసిన ధర్మాసనం.. గురువారం తీర్పు వెలువరించింది.

**ఎంత సమయం కావాలని ముందే అడిగాం..**

'2025 జనవరి 15న సుప్రీంకోర్టు ముందు కేసు దాఖలైన తర్వాత 16న తొలిసారిగా మేం కొందరికి నోటీసులు జారీ చేశాం. ఫిబ్రవరి 3న జరిగిన విచారణ సందర్భంగా.. ఫిబ్రవరి 4న మరికొందరికి నోటీసులు జారీ చేశాం. జనవరి 31న తొలుత ఈ కేసు విచారణకు వచ్చినప్పుడే అనర్హత పిటిషన్లపై నిర్ణయం తీసుకునేందుకు స్పీకర్‌కు ఎంత సమయం అవసరమో తెలుసుకోవాల్సిందిగా మేము సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గికి సూచించాం..' అని ధర్మాసనం తెలిపింది.

**'ఆపరేషన్ సక్సెస్.. పేషెంట్ నాట్ డెడ్'లా ఉండాలి**

'10 షెడ్యూల్ కింద స్పీకర్ ట్రిబ్యునల్‌గా పని చేస్తున్నప్పటికీ, ఆయన ఎటువంటి రాజ్యాంగపరమైన రక్షణ (కానిస్టిట్యూషనల్ ఇమ్యూనిటీ)ను పొందలేరు. నిజానికి ఈ కేసును విచారించిన సింగిల్ జడ్జి అనర్హత పిటిషన్లపై విచారించేందుకు సమయాన్ని నిర్ణయించమని స్పీకర్‌కు సూచించారు. అందుకు నాలుగు వారాల గడువిచ్చారు. అంతేకానీ పిటిషన్లపై నిర్ణయం తీసుకోమని ఎలాంటి ఆదేశాలు జారీ చేయలేదు. అయినప్పటికీ.. హైకోర్టు సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పులో జోక్యం చేసుకుని సరైన సమయంలో నిర్ణయం తీసుకోవాలని చెప్పడం ద్వారా డివిజన్ బెంచ్ తప్పిదానికి పాల్పడింది. ఎలాంటి వ్యతిరేక వ్యాఖ్యలు లేకపోయినా తెలంగాణ శాసనసభ కార్యదర్శి సింగిల్ జడ్జి తీర్పును సవాల్ చేయడం సరైంది కాదు. ఇకపై ఈ కేసు 'ఆపరేషన్ సక్సెస్.. పేషెంట్ నాట్ డెడ్' లా ఉండాలి..' అని సుప్రీంకోర్టు (నవ్వుతూ) వ్యాఖ్యానించింది.

**విచారణను పొడిగించేందుకు అనుమతి వద్దు**

'అనర్హత పిటిషన్లను ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేల విచారణను పొడిగించడానికి స్పీకర్ అనుమతించకూడదు. స్పీకర్ నిర్ణయాలపై న్యాయ సమీక్షకు అధికారాలు (కిహోటో హోల్లోహన్ (10వ షెడ్యూల్ సమర్థించిన) కేసులో తీర్పు నిష్పత్తిని ప్రస్తావిస్తూ) ఇరుకైన పరిధిలో (న్యారో కంపాస్) ఉన్నాయి. అలాగే స్పీకర్ నిర్ణయాలు న్యాయ సమీక్షకు పూర్తిగా అతీతం కాదు. స్పీకర్లు అనర్హత పిటిషన్లను ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉంచే పరిస్థితిని రాజ్యాంగ ధర్మాసనం ఊహించి ఉండకపోవచ్చు. అనర్హత పిటిషన్లను స్పీకర్ మూడు నెలల్లోగా నిర్ణయించాలని కీషమ్ మేఘచంద్ర సింఘ్ కేసులో తీర్పు ఉంది. శివసేన, ఎన్సీపీ ఎమ్మెల్యేల ఫిరాయింపుల పిటిషన్లను నిర్ణీత సమయంలోగా నిర్ణయించాలని మహారాష్ట్ర స్పీకర్‌కు జారీ అయిన ఆదేశాలను కూడా కోర్టు పరిగణనలోకి తీసుకుంది..' అని న్యాయమూర్తులు తెలిపారు.

**జాతీయ ఆందోళనకు సంబంధించిన అంశం**

'అనర్హత పిటిషన్లపై నిర్ణయాధికారం స్పీకర్‌కే ఇచ్చాం. పార్టీ ఫిరాయింపులకు పాల్పడ్డ ఎమ్మెల్యేలపై అనర్హత విషయంలో స్పీకర్ తగిన సమయంలో స్పందించాల్సిన అవసరం ఉంది. అయితే అనర్హత విషయంలో స్పీకర్ నిర్ణయాధికారాన్ని పార్లమెంట్ పునఃపరిశీలించాలి. రాజకీయ ఫిరాయింపులు అనేవి జాతీయ ఆందోళనకు సంబంధించిన అంశం. మనం దీనిని ఎదుర్కొనకపోతే ప్రజాస్వామ్యానికి పెద్ద ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది..' అని జస్టిస్ గవాయ్ వ్యాఖ్యానించారు. అనర్హతల విషయంలో స్పీకర్ నిర్ణయాధికారాన్ని పార్లమెంట్ పునః పరిశీలించాలి. రాజకీయ ఫిరాయింపులు అనేవి జాతీయ ఆందోళనకు సంబంధించిన అంశం. వీటిని ఎదుర్కొనకపోతే మన ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీసే ప్రమాదం ఉంది. 10 షెడ్యూల్ కింద స్పీకర్ ట్రిబ్యునల్‌గా వ్యవహరిస్తున్నప్పటికీ..ఆయన ఎటువంటి ''రాజ్యాంగపరమైన రక్షణ''ని పొందలేరు. అనర్హత పిటిషన్లను ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేల విచారణను స్పీకర్ పొడిగించుకుంటూ పోవడానికి వీల్లేదు..

**– సుప్రీంకోర్టు ధర్మాసనం**

బీఆర్ఎస్ నేతల అభ్యర్థన తోసిపుచ్చిన ధర్మాసనం

ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌పై సుప్రీం కోర్టే నిర్ణయం తీసుకోవాలని బీఆర్ఎస్ నేతలు చేసిన అభ్యర్థనను సర్వోన్నత న్యాయస్థానం తోసిపుచ్చింది. కిహోటో హోల్లోహన్, సుభాష్‌దేశాయ్ తదితరుల కేసులకు సంబంధించి రాజ్యాంగ బెంచ్ తీర్పును ప్రస్తావించింది. ఎమ్మెల్యేల అనర్హతపై నిర్ణయం తీసుకునే అధికారం స్పీకర్‌కే ఉందని స్పష్టం చేసింది. 'అయితే, ఫిరాయింపులు జరిగినప్పుడు అనర్హత అంశాన్ని తేల్చే ముఖ్యమైన బాధ్యతను స్పీకర్‌కు లేదా చైర్మన్‌కు అప్పగించే యంత్రాంగం వల్ల రాజకీయ ఫిరాయింపులను సమర్థవంతంగా అరికట్టగలుగుతున్నామా.. లేదా? అనే అంశాన్ని మాత్రం పార్లమెంట్ పరిశీలించాలి. ప్రజాస్వామ్య పునాదులు బలంగా ఉండాలంటే, ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించాలంటే ప్రస్తుత యంత్రాంగం సరిపోతుందా? లేదా? అనే విషయం కూడా పార్లమెంటే తేల్చాలి..' అని ధర్మాసనం స్పష్టం చేసింది. అనర్హత పిటిషన్లపై తేల్చే అత్యంత ముఖ్యమైన బాధ్యతను పార్లమెంట్ స్పీకర్‌కు అప్పగించినప్పుడు ఆ హోదాలో ఉన్నవారు ఎంతవేగంగా చర్యలు తీసుకున్నారనేది ప్రధానమని సర్వోన్నత న్యాయస్థానం వ్యాఖ్యానించింది.

**షెడ్యూల్ 10 ఏం చెబుతోంది..**

ఇది పార్టీల నుంచి ఫిరాయింపులను నిరోధించడానికి రూపొందించింది. దీన్ని ఫిరాయింపుల నిరోధక చట్టం అని కూడా అంటారు. రాజకీయ స్థిరత్వం, ప్రజాస్వామ్య ప్రక్రియ పరిరక్షణ, విలువలను కాపాడటం కోసం దీన్ని ఉద్దేశించారు. ప్రజాప్రతినిధులు పార్టీలు ఫిరాయించకుండా నిరోధించడం దీని ముఖ్య ఉద్దేశం. దీని ప్రకారం..పార్టీ ఆదేశాలు చట్టసభల సభ్యులు పాటించాలి. పార్టీ ఆదేశాలకు విరుద్ధంగా ఓటు వేసినా లేదా పార్టీ నుంచి వైదొలిగినా చట్టసభల సభ్యులను అనర్హులుగా ప్రకటించవచ్చు. ఫిరాయింపుల అంశాల్లో కోర్టులకు అధికార పరిధి ఉండదు. స్పీకర్ లేదా చైర్మన్ నిర్ణయమే అంతిమం. ఒక పార్టీ నుంచి గెలిచి మరో పార్టీలో చేరితే సభలో సభ్యుడిగా ఉండటానికి అనర్హుడు. ఒకవేళ ఒక పార్టీ మరో పార్టీలో పూర్తిగా విలీనమైతే అనర్హత వర్తించదు. సభ్యుని అనర్హతపై ఏ కోర్టుకు అధికార పరిధి ఉండదు.




మొదటి పేజీ తరువాయి

మొదటి పేజీ తరువాయి

## కబ్జా స్థలాల్ని స్వాదీనం చేసుకుంటాం




ఈ కబురు,హైదరాబాద్: ఆక్రమణలకు గురైన తమ శాఖ భూముల్లో అంగుళం స్థలాన్ని కూడా వదలిపెట్టకుండా యుద్ధ ప్రాతిపదికన స్వాదీనం చేసుకుంటామని నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. రూ. వందల కోట్ల విలువైన భూములు కబ్జాలకు గురయ్యాయని.. దీన్ని ఉపేక్షించకుండా కఠినంగా వ్యవహరిస్తామన్నారు. భవిష్యత్తులో ఆక్రమణలకు చెక్ పెట్టేందుకు ఆ భూముల చుట్టూ కంచెల ఏర్పాటుతో పాటు చట్టపరమైన చర్యలూ తీసుకుంటామని చెప్పారు. నీటిపారుదల శాఖ భూముల పరిరక్షణపై సచివాలయంలో గురువారం ఆ శాఖ ప్రత్యేక కార్యదర్శి, ఈఎన్సీ (జనరల్) అంజాద్ హుస్సేన్, ఈఎన్సీ అడ్మిన్ రమేశ్ బాబు, భూసేకరణ కమిషనర్ శివకుమార్ నాయుడు హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌తో మంత్రి ఉత్తమ్ సమీక్ష నిర్వహించారు. కాల్వలకు ఇరువైపులా ఉన్న భూములతోపాటు ప్రాజెక్టుల స్థలాల్లో సౌర విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని ఆదేశించారు.

**కోర్టుల్లో వాదనలకు ప్రత్యేక ప్రభుత్వ న్యాయవాది..**

హైదరాబాద్‌లోని గండిపేట, రాజేంద్రనగర్ పరిధిలోని హిమాయత్‌సాగర్, కిస్మత్‌పుర, వాలంతరి, ఇంజనీరింగ్ ల్యాబ్ (టీజీఈఆర్ఎల్)కు చెందిన 426.3 ఎకరాలకుగాను 131.31 ఎకరాలు కబ్జాకు గురైనట్లు గుర్తించామని మంత్రి ఉత్తమ్ తెలిపారు. ఐటీఐఆర్ అ□దీనంలోని 81.26 ఎకరాల స్థలంపై కోర్టులో కేసు పెండింగ్‌లో ఉండగా మిగిలిన 50.13 ఎకరాలు కబ్జాకు గురయ్యాయన్నారు. వాటిపై జిల్లా కోర్టులో 20 కేసులు, హైకోర్టులో 2 కేసులు పెండింగ్‌లో ఉన్నట్లు వివరించారు. భూముల పరిరక్షణలో న్యాయపరమైన చిక్కులను ఎదుర్కొనేందుకు ప్రత్యేక ప్రభుత్వ న్యాయవాదిని నియమించాలని నిర్ణయించామన్నారు. ఈ భూములను తిరిగి స్వాధీనం చేసుకునేందుకు నీటిపారుదల శాఖ, హైడ్రా, రెవెన్యూ, ఆర్ అండ్ ఆర్ అధికారులతో సమన్వయం చేసుకోవాలని ఆదేశించామని చెప్పారు. నీటిపారుదల భూముల్ని గుర్తించండి.. నీటిపారుదల శాఖ ప్రాజెక్టులకు సంబంధించిన క్వార్టర్లలో అక్రమంగా నివసిస్తున్న వారిని ఖాళీ చేయించి తక్షణమే సమగ్ర సమాచారం తన ముందు ఉంచాలని మంత్రి ఉత్తమ్ ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా నీటిపారుదల శాఖ భూములను సత్వరం గుర్తించాలన్నారు. తమ శాఖ భూముల్లో సౌర విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుపై ఇటీవలి మంత్రివర్గ సమావేశంలో చర్చించామన్నారు. దీంతో రాష్ట్రంలోని ఎత్తిపోతల పథకాలకు అవసరమైన విద్యుత్‌ను నీటిపారుదల శాఖ స్వయంగా ఉత్పత్తి చేసుకోవచ్చని చెప్పారు.

## ఆగస్టు 2న పీఎం కిసాన్ నిధులు విడుదల



**ఈ కబురు: రైతులకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త తెలిపింది. ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ పథకం నిధులను ఆగస్టు 2న రైతుల ఖాతాల్లో జమ చేయనున్నట్టు కేంద్రం ప్రకటించింది. పీఎం కిసాన్ సమ్మాన్ 20వ విడత నిధులను ప్రధాని నరేంద్ర మోడీ వారణాసిలో జరిగే కార్యక్రమం వేదికగా విడుదల చేయనున్నట్టు పేర్కొన్నారు. బుధవారం జరిగిన ఉన్నతస్థాయి సమావేశంలో కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమశాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ఈ కార్యక్రమ ఏర్పాట్లను సమీక్షించారు. ఈ జాతీయ కార్యక్రమం ద్వారా దేశంలోని 9.7 కోట్ల మంది అర్హులైన రైతులకు ఒక్కొక్కరికి రూ.2 వేలను వారి ఖాతాల్లో జమ చేస్తారు. ఈ విడతలో రూ.20,500 కోట్లు నిధులు పంపిణీ చేయనున్నారు. ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ పథకం ఫిబ్రవరి 2, 2019న ప్రారంభమైంది. దీని కింద ప్రతి అర్హత గల రైతు కుటుంబానికి సంవత్సరానికి రూ.6 వేల ఆర్థిక సాయం అందజేస్తారు. ఈ నిధులు నాలుగు నెలలకు ఒకసారి రూ.2 వేల చొప్పున మూడు విడతల్లో డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (డీబీటీ) ద్వారా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ అవుతుంది. ఈ పథకం ద్వారా ఇప్పటివరకు 19 వాయిదాలలో రూ.3.69 లక్షల కోట్ల మంది రైతులు ఈ పథకం ద్వారా లబ్ధి పొందారు.**

## ఉప ఎన్నికలొస్తాయి సిద్ధం కండి

సుప్రీం తీర్పు కాంగ్రెస్ పార్టీకి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి చెంపదెబ్బ అని వ్యాఖ్యానించాయి. రాష్ట్రంలోని పది నియోజకవర్గాల్లో ఉపఎన్నికలు వస్తాయని, ఆ స్థానాల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించేందుకు సిద్ధం కావాలని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ తమ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సుప్రీంకోర్టు తీర్పుపై ఓ ప్రకటన ద్వారా హర్షం వ్యక్తం చేసిన కేటీఆర్.. కొందరు ప్రజాప్రతినిధులు అడ్డదారులు తొక్కినంత మాత్రాన ప్రజాస్వామ్య వ్యవస్థ నాశనం కాదని సుప్రీం తీర్పు నిరూపించిందని పేర్కొన్నారు. స్పీకర్ పదవిని అడ్డంపెట్టుకొని కాంగ్రెస్ చేసిన రాజ్యాంగ వ్యతిరేక ఫిరాయింపుల రాజకీయానికి సుప్రీం తీర్పు చెంపదెబ్బ అని తెలిపారు. సుప్రీంకోర్టు తీర్పును గౌరవించి ఫిరాయింపు ఎమ్మెల్యేలపై స్పీకర్ అనర్హత వేటు విధించాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు తీర్పుతో రానున్న మూడు నెలల్లో 10 నియోజకవర్గాల్లో ఉపఎన్నికలు వస్తాయని భావిస్తున్నామన్నారు. కాగా, ఫిరాయింపు ఎమ్మెల్యేల విషయంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తన నిజాయితీని నిరూపించుకోవాలని కేటీఆర్ ఈ సందర్భంగా కోరారు. పార్టీ మారితే ఆటోమేటిక్‌గా అనర్హత వర్తించాలని 'పాంచ్‌న్యాయ్' పేరును వల్లించిన రాహుల్ గాంధీ.. రాజ్యాంగ వ్యతిరేక చర్యలను అడ్డుకుని తన చిత్తశుద్ధిని చాటుకోవాలన్నారు. పలు రాష్ట్రాల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు మరో పార్టీలో చేరితే తప్పుబడుతున్న రాహుల్ గాంధీ.. తెలంగాణలో పార్టీమారిన ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలని స్పీకర్‌ను కోరతారా? అని మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రశ్నించారు. సుప్రీం తీర్పుపై ఎక్స్‌లో హర్షం వ్యక్తం చేసిన హరీశ్.. 52వ రాజ్యాంగ సవరణ ద్వారా దివంగత రాజీవ్ గాంధీ ప్రవేశపెట్టిన ఫిరాయింపుల నిరోధక చట్ట ప్రకారం ఫిరాయింపు ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలని రాహుల్ గాంధీ ప్రతిపాదించాలని డిమాండ్ చేశారు. కాగా, సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నామన్న బీఆర్ఎస్ రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర.. సుప్రీంకోర్టు ఆదేశాలను స్పీకర్ పాటిస్తారనే ఆశాభావం వ్యక్తం చేశారు. సుప్రీం తీర్పు భవిష్యత్తులో పార్టీ ఫిరాయింపులకు అడ్డుకట్టగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు. ఇక, సుప్రీంకోర్టు తీర్పుతోనైనా కాంగ్రెస్ పార్టీ కళ్లు తెరుచుకొని ప్రజాస్వామ్య పద్ధతులు పాటించాలని, ఫిరాయింపు ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేసి ప్రజాస్వామ్య విలువలను కాపాడాలని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి అభిప్రాయపడ్డారు. కాగా, ఉప ఎన్నికలు ఎలా వస్తాయి అధ్యక్షా? అంటూ ముఖ్యమంత్రినన్న అధికార మదంతో రేవంత్ రెడ్డి శాసనసభలో చేసిన వ్యాఖ్యలకు విరుద్ధంగా సుప్రీంకోర్టు తీర్పునివ్వడం చెంపపెట్టులాంటిదని అసెంబ్లీలో బీఆర్ఎస్ విప్ కేపీ వివేకానంద పేర్కొన్నారు. ఉప ఎన్నికలు ఎలా వస్తాయో సుప్రీం కోర్టు చెప్పిందని వివేకానంద వ్యాఖ్యానించారు.

**స్పీకర్ నిర్ణయం తీసుకోకుంటే కోర్టు ధిక్కరణే**
**బీఆర్ఎస్ న్యాయవాది మోహిత్ రావు**



ఫిరాయింపు ఎమ్మెల్యేలపై మూడు నెలల్లోగా స్పీకర్ నిర్ణయం తీసుకోకపోతే అది కోర్టు ధిక్కరణ కిందకు వస్తుందని బీఆర్ఎస్ తరపున సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన న్యాయవాది మోహిత్ రావు అన్నారు. ఎమ్మెల్యేలు విచారణను ఆలస్యం చేయడాన్ని స్పీకర్ కార్యాలయం అనుమతించకూడదని, ఒకవేళ ఎమ్మెల్యేలు ఆలస్యం చేస్తే తీవ్రంగా పరిగణించాలని కూడా సుప్రీంకోర్టు తెలిపిందని చెప్పారు. గతంలో చాలా కేసుల్లో ఎన్నికలు సమీపించినప్పుడు చర్యలు తీసుకున్న విషయాన్ని సుప్రీంకోర్టు దృష్టికి తీసుకెళ్లామని వివరించారు. వాటి ఆధారంగానే ప్రస్తుతం ఈ కేసు విషయంలో ఆపరేషన్ సక్సెస్.. పేషెంట్ డెడ్‌లా ఉండొద్దని సూచనలు ఇచ్చిందన్నారు.

## ఫిరాయింపు ఎమ్మెల్సీలపైనా సుప్రీంకోర్టుకు: కేసీఆర్

ఈ కబురు ,అమరావతి: జనరేటివ్ ఏఐ ఆధారిత పరిష్కారాలను కనుగొని సమన్వయం చేయడానికి ఏపీలో మైక్రోసాఫ్ట్ ఎక్స్‌పీరియన్స్ జోన్‌ను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ఐటీశాఖ మంత్రి నారా లోకేశ్ ఆ సంస్థ ప్రతినిధుల్ని కోరారు. అమరావతి క్వాంటమ్ వ్యాలీ టెక్‌పార్క్‌లో అజూర్ ఓపెన్ ఏఐ సర్వీస్, మైక్రోసాఫ్ట్ కోపైలట్‌ను ఉపయోగించి పరిష్కారాలను అన్వేషించేందుకు మైక్రోసాఫ్ట్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్ ఆధ్వర్యంలో 2026లో హ్యాకథాన్ నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. దీనికి అవసరమైన సౌకర్యాలను ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. సింగపూర్ పర్యటనలో ఉన్న లోకేశ్ నేతృత్వంలోని బృందం.. మైక్రోసాఫ్ట్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆ సంస్థ గవర్నమెంట్ ఎఫైర్స్ హెడ్ మార్కస్ లోహ్, సెలా హెడ్ జాస్మిన్ బేగం, సీటీవో మార్క్ సౌజాలతో లోకేశ్ భేటీ అయ్యారు. భారత్‌లో అతిపెద్ద నైపుణ్యం కలిగిన ఐటీ నిపుణుల సమూహాల్లో ఏపీ ఒకటని చెప్పారు. అమెరికాలో భారతీయ ఐటీ శ్రామికశక్తిలో 25 శాతం కంటే ఎక్కువ మంది తెలుగువారే ఉన్నారన్నారు. మైక్రోసాఫ్ట్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్ భాగస్వామ్యంతో జనరేటివ్ ఏఐ, హైబ్రిడ్ క్లౌడ్, మైక్రోసాఫ్ట్ ఉత్పత్తులలో నైపుణ్యం కలిగిన ఐటీ వర్క్‌ఫోర్స్‌ను అభివృద్ధి చేయడానికి ఏపీలోని టాలెంట్ పూల్‌ను ఉపయోగించుకోవాలని కోరారు. అనంతరం లోకేశ్ బృందం ఇన్ఫినియన్ సెమీ కండక్టర్స్ మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్‌ను సందర్శించింది. ఆ సంస్థ ప్రెసిడెంట్ &ఎండీ సీఎస్ చువాతో సమావేశమైంది. ఏపీలో ఈఎంసీలు, పారిశ్రామిక పార్కుల్లో సెమీకండక్టర్ల తయారీకి అనుబంధంగా ప్యాకేజింగ్, టెస్టింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేయాలని మంత్రి లోకేశ్ కోరారు. ఈవీ తయారీ యూనిట్లకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దఎత్తున ప్రోత్సాహకాలు అందిస్తోందని వివరించారు.



మొదటి పేజీ తరువాయి

మొదటి పేజీ తరువాయి

## వ్యక్తుల ఇష్టాల ప్రకారం కాళేశ్వరం పనులు!

ఈ కబురు, హైదరాబాద్: కాళేశ్వరం బ్యారేజీల నిర్మాణంలో అన్ని రకాల వైఫల్యాలు జరిగాయని, దీనికి కింది స్థాయి నుంచి ఉన్నత స్థాయి వరకు పలువురు కారణమని జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ స్పష్టం చేసినట్లు తెలిసింది. వ్యవస్థలు కాకుండా వ్యక్తుల ఇష్టాల ప్రకారం పనులు జరిగాయని, ఉన్నత స్థాయిలో వచ్చిన ఒత్తిడులకు లొంగి నిబంధనలకు విరుద్ధంగా నిర్ణయాలు తీసుకొన్నారని, ఆర్థిక అవకతవకలు జరిగాయని... ఇలా పలు అంశాలను కాళేశ్వరం న్యాయ విచారణ కమిషన్ పేర్కొన్నట్లు సమాచారం. కాళేశ్వరం బ్యారేజీలపై న్యాయ విచారణ చేపట్టిన జస్టిస్ పీసీ ఘోష్ గురువారం ఉదయం 11.30 గంటలకు నీటిపారుదల శాఖ ముఖ్యకార్యదర్శి రాహుల్ బొజ్జాకు నివేదికను అందజేశారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలకు సంబంధించి డీపీఆర్ తయారీ మొదలుకొని మేడిగడ్డ బ్యారేజీ కుంగడం... అన్నారం, సుందిళ్ల బ్యారేజీలలో సీపేజీల వరకు ఎప్పుడు ఏం జరిగింది... రికార్డుల ఆధారంగా ఎక్కడ ఎవరు బాధ్యులన్నది వివరంగా నివేదికలో తెలియజేసినట్లు విశ్వసనీయవర్గాల ద్వారా తెలిసింది. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ నివేదికలో అక్రమాలకు బాధ్యులుగా ప్రస్తావించిన వారినే కాకుండా మరికొందరి పేర్లను కూడా న్యాయ విచారణ కమిషన్ నివేదికలో బాధ్యులుగా పేర్కొన్నట్లు సమాచారం. గత ముఖ్యమంత్రి వద్ద జరిగిన సమావేశంలో తీసుకొన్న నిర్ణయాల గురించి, పనులను దగ్గరుండి పర్యవేక్షించిన, ఆ సమయంలో సీఎంవోలో పని చేసిన ఓ ఐఏఎస్ అధికారి గురించి నివేదికలో ప్రస్తావించినట్లు తెలుస్తోంది. 2019లో నిర్మాణం పూర్తయిన వెంటనే బ్యారేజీకి సమస్య వచ్చినా, దాని గురించి తెలిసీ పట్టించుకోకుండా ఓఅండ్ఎంలో నిర్లక్ష్యం వహించారని... మేడిగడ్డ బ్యారేజీ పునరుద్ధరణకు అయ్యే ఖర్చును పూర్తిగా నిర్మాణ సంస్థే భరించాలని స్పష్టం చేసినట్లు సమాచారం. మంత్రివర్గ నిర్ణయం లేకుండా బ్యారేజీల నిర్మాణం చేపట్టారని, తర్వాత ర్యాటిఫై చేసినా ఇందులో బ్యారేజీల పనులు లేవని వివరించినట్లు తెలిసింది. క్వాలిటీ కంట్రోల్ అధికారులు పూర్తి స్థాయిలో నిర్లక్ష్యం వహించారని, పర్యవేక్షణ లోపం జరిగిందని, బాధ్యులైన ఇంజినీర్లు రెండేళ్లపాటు తనిఖీ కూడా చేయలేదని తప్పుపట్టినట్లు సమాచారం. అంచనాల్లోనూ మార్పులు: బ్యారేజీల నిర్మాణాలకు సంబంధించిన అంచనాల్లోనూ మార్పులు జరిగినట్లు కమిషన్.. నివేదికలో పేర్కొన్నట్లు తెలిసింది. మొదట ప్రభుత్వం ఆమోదించిన అంచనాలో ఉండాల్సినవి లేకుండా, నిర్మాణ సంస్థకు పని అప్పగించిన తర్వాత సవరించిన అంచనాలో వాటిని చేర్చి నిర్మాణ సంస్థలకు ప్రయోజనం కల్పించారని, ఇది ఉద్దేశపూర్వకంగానే జరిగిందని తెలిపినట్లు సమాచారం. ఆర్థికపరమైన అంశాల్లో అనేక లోపాలు జరిగాయని, అధికారులు చేయాల్సిన పనులు చేయలేదంటూ ఆర్థిక శాఖ అధికారులనూ తప్పు పట్టినట్లు తెలిసింది. అనేక అక్రమాలు జరుగుతున్నా నీటిపారుదల శాఖ అధికారులు ప్రశ్నించలేదని, వ్యవస్థలే పని చేయలేదని స్పష్టం చేసినట్లు సమాచారం. ప్రభుత్వం నిపుణుల కమిటీని నియమించినా... ఆ కమిటీ చేసిన సిఫార్సులపై ఎలాంటి నిర్ణయం తీసుకోకుండా బుట్టదాఖలు చేసిందని, వీటితో సంబంధం లేకుండా బ్యారేజీల నిర్మాణ నిర్ణయం ముందుగానే జరిగిపోయిందని పేర్కొన్నట్లు తెలిసింది. ఓ నిర్మాణం ఎలాగైతే చేయకూడదో అలా చేశారని వివరించినట్లు సమాచారం. నల్లా వెంకటేశ్వర్లు, మురళీధర్, సుధాకర్‌రెడ్డి.. ఇలా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ నివేదికలో ఉన్నవారి పేర్లతోపాటు కాళేశ్వరం కార్పొరేషన్ విషయంలో హరిరాం, డిజైన్స్ విభాగం, ఓఅండ్ఎం, క్వాలిటీ కంట్రోల్ అధికారుల పేర్లను ప్రస్తావించినట్లు తెలిసింది. ఓఅండ్ఎం చేయకుండానే బ్యారేజీలో నీటిని నింపారని వివరంగా పేర్కొన్నట్లు విశ్వసనీయవర్గాల ద్వారా తెలిసింది. మేడిగడ్డ బ్యారేజీ విషయంలో నిర్మాణ సంస్థ తన బాధ్యతలను సరిగా నిర్వర్తించలేదని కూడా స్పష్టీకరించినట్లు సమాచారం. బ్యారేజీల నిర్మాణ స్థలం మార్పు, వాప్కోస్ ఇచ్చిన డీపీఆర్‌ను ప్రభుత్వం స్క్రూటినీ చేయకుండానే అనుమతి ఇవ్వడం... ఇలా అనేక అంశాలను విపులీకరించినట్లు తెలిసింది. కమిషన్ నివేదిక బహిర్గతమైతే చాలా అంశాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. నివేదిక సమర్పించిన తర్వాత జస్టిస్ ఘోష్‌ను విలేకరులు కలవగా నివేదిక ఇవ్వడంతో తమ పని అయిపోయిందని, తదుపరి ఏం చేయాలన్నది ప్రభుత్వ వ్యవహారమని అన్నారు. జస్టిస్ ఘోష్ శుక్రవారం కోల్‌కతా వెళ్లనున్నారు. 'నివేదికలో ఏముందో నాకు తెలియదు. ఇంకా చదవలేదు.. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ద్వారా ఈ నివేదికను సీఎంకు అందజేస్తాం' అని రాహుల్ బొజ్జా విలేకరులతో అన్నారు.

700 పేజీల నివేదిక...

2024 మార్చిలో జస్టిస్ ఘోష్ కమిషన్ ఏర్పాటు కాగా, 2025 జులై31న గడువు ముగిసింది. ప్రభుత్వం కమిషన్ గడువును ఏడుసార్లు పొడిగించింది. చివరి రోజున ఉదయం 10.30 గంటలకు జస్టిస్ ఘోష్ బీఆర్‌కే భవన్‌లోని కమిషన్ కార్యాలయానికి రాగా, రాహుల్ బొజ్జా 11.20 గంటలకు వచ్చారు. అనంతరం సుమారు 700 పేజీల నివేదికను ఆయన రాహుల్‌కు అందజేశారు. కమిషన్ కార్యాలయం నుంచి నేరుగా సెక్రటేరియట్‌కు వెళ్లిన రాహుల్.. సీఎస్ రామకృష్ణారావు, మంత్రి ఉత్తమ్‌తో మాట్లాడారు. నివేదికను శుక్రవారం ఆయన సీఎం రేవంత్‌రెడ్డికి అందజేస్తారు. తర్వాత సీఎం, మంత్రి సమక్షంలో నివేదికను పరిశీలించే అవకాశం ఉన్నట్లు సమాచారం.

తదుపరి కార్యాచరణ ఏమిటో?

జస్టిస్ ఘోష్ నివేదికపై ప్రభుత్వ తదుపరి కార్యాచరణ ఏంటన్నది చర్చనీయాంశంగా మారింది. ముఖ్యమంత్రి వద్ద చర్చ జరిగిన తర్వాత మంత్రివర్గంలో పెట్టి చర్చించి, తర్వాత శాసనసభలో ప్రవేశపెట్టే అవకాశం ఉంది. దీంతో పాటు బ్యారేజీల నిర్మాణంలో ఎలాంటి లోపాలు, వైఫల్యాలు జరిగాయి.. ఇందుకు బాధ్యులెవరు.. వీటికి ఆధారాలేంటి తదితర అంశాలను కమిషన్ తన నివేదికలో పేర్కొన్నందున సీఐడీ లేదా మరో సంస్థకు తదుపరి దర్యాప్తుకోసం ఇచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.



మొదటి పేజీ తరువాయి

## అనుమతులు తీసుకునే కాళేశ్వరం కట్టారా



ఈ కబురు: సముద్రంలోకి వృధాగా వెళ్లే వరద జలాలనే తాము బనకచర్ల కోసం వాడుకుంటామని.. అందులో తప్పేముందని మంత్రి లోకేశ్ ప్రశ్నించారు. తెలంగాణను దాటి దిగువన సముద్రంలో కలిసిపోయే గోదావరి జలాలను వాడుకుంటే ఆ రాష్ట్రానికి వచ్చే నష్టమేమిటని అడిగారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు అనుమతులు తీసుకునే తెలంగాణ కట్టిందా అని ప్రశ్నించారు. 'స్టడీ చేసే దానిని కట్టారా? అక్కడో రూలు .. ఇక్కడో రూలా? తెలంగాణకో నీతి.. ఆంధ్రాకో నీతా? ఇది ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొట్టడం కాదా? బనకచర్ల పథకంలో తప్పెక్కడుంది? తెలంగాణ నుంచి నీటిని ఎత్తిపోసి దానికి వాడుకోవడం లేదు కదా! కాళేశ్వరం ప్రాజెక్టుకు చిల్లుపెట్టి తోడేయడం లేదు కదా! ఒకవేళ ఒక ఏడాది వరద రాకపోతే మిగులు జలాలను బనకచర్ల కోసం వాడుకోం' అని స్పష్టం చేశారు. బనకచర్లపై చర్చ జరగాలని కోరుకుంటున్నానని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు ఏపీ ఎప్పుడూ అభ్యంతరం వ్యక్తం చేయలేదని గుర్తుచేశారు. టీడీపీ తెలంగాణకు వ్యతిరేకంగా పనిచేయదన్నారు. తెలుగు ప్రజలందరి కోసం తాము మాట్లాడతామని తెలిపారు.

మొదటి పేజీ తరువాయి

# బీసీ రిజర్వేషన్ల సాధనకు కలిసి రండి



ఈ కబురు ,వికారాబాద్, పరిగి: ప్రజాస్వామ్యంలో ప్రజలే దేవుళ్లని.. అందుకే వారి కోసం పాదయాత్ర చేస్తున్నామని ఏఐసీసీ తెలంగాణ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ అన్నారు. వికారాబాద్ జిల్లా పరిగిలో కాంగ్రెస్ చేపట్టిన జనహిత పాదయాత్ర, రోడ్‌షోలో పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, కొండా సురేఖ, అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్‌తో కలిసి ఆమె గురువారం పాల్గొన్నారు. మండల పరిధిలోని రంగాపూర్ నుంచి పరిగి పట్టణం వరకు ఆరు కిలోమీటర్ల మేర పాదయాత్ర నిర్వహించారు. అనంతరం స్థానిక కొడంగల్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన రోడ్‌షోలో మీనాక్షి మాట్లాడుతూ.. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కోసం కేంద్రంతో పోరాడుతున్నామని, ప్రజలు సైతం ఇందులో పాలుపంచుకోవాలని పిలుపునిచ్చారు. దేశంలో ఎక్కడా లేని అభివృద్ధి తెలంగాణలో జరుగుతోందని తెలిపారు.

**65 వేల ఉద్యోగాలిచ్చాం..**

పాదయాత్రలకు కాంగ్రెస్ పెట్టింది పేరు అని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ అన్నారు. ఏఐసీసీ ఆదేశాల మేరకే జనహిత పాదయాత్ర చేస్తున్నామని తెలిపారు. కేసీఆర్ పాలనలో చేసిన అప్పులకు వడ్డీలు కడుతూనే సంక్షేమం, అభివృద్ధిని కొనసాగిస్తున్నామని వెల్లడించారు. తాము అధికారంలోకి వచ్చాక 65 వేల ఉద్యోగాలిచ్చామని తెలిపారు. వచ్చే రెండేళ్లలో మరో 35 వేల ఉద్యోగాలు భర్తీ చేస్తామని ప్రకటించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని తమ అధినాయకత్వం డిమాండ్ చేస్తుంటే.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ముఖం చాటేస్తోందని విమర్శించారు. బీసీ రిజర్వేషన్ల సాధన కోసం ఈ నెల 5, 6, 7 తేదీల్లో ఢిల్లీలో నిర్వహించనున్న నిరసన కార్యక్రమాలకు రావాలని బీజేపీ, బీఆర్ఎస్ నాయకులను కోరారు. మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ..పాలమూరు రంగారెడ్డి పథకాన్ని పూర్తి చేసి తీరుతామని స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు టి.రామ్మోహన్‌రెడ్డి, కాలె యాదయ్య, బి.మనోహర్‌రెడ్డి, మల్‌రెడ్డి రంగారెడ్డి, వీర్లపల్లి శంకర్, పీసీసీ ప్రధాన కార్యదర్శి రఘువీర్‌రెడ్డి, రంగారెడ్డి డీసీసీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, రాజీవ్‌గాంధీ పంచాయతీ రాజ్ సంఘటన్ చైర్మన్ రామచల్ల సిద్ధేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# ట్రంప్ నిజం మాట్లాడినందుకు సంతోషిస్తున్నా: రాహుల్



**ఈ కబురు,దిల్లీ: భారత ఆర్థిక వ్యవస్థ పతనమైందని ట్రంప్ నిజం మాట్లాడారని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. భారత ఆర్థిక వ్యవస్థ పతనమైందన్న విషయం ప్రధాని మోదీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు తప్ప ప్రతి ఒక్కరికీ తెలుసని ఎద్దేవా చేశారు. ట్రంప్ నిజం మాట్లాడినందుకు సంతోషిస్తున్నానని పార్లమెంటు ఆవరణలో మీడియాతో ఆయన వ్యాఖ్యానించారు. 'విదేశీ వ్యవహారాల మంత్రి మన విదేశీ విధానం అద్భుతంగా ఉందని ప్రసంగాలు ఇస్తున్నారు. కానీ ఒకపక్క భారత్‌తో స్నేహాన్ని అమెరికా దుర్వినియోగం చేస్తోంది. మరోపక్క చైనా వెంటాడుతోంది. వారికి (భాజపా సర్కారుకు) దేశాన్ని ఎలా నడపాలో తెలియదు. వారు దేశ ఆర్థిక, రక్షణ, విదేశాంగ విధానాన్ని పూర్తిగా నాశనం చేస్తున్నారు' అని కేంద్రంపై రాహుల్ ధ్వజమెత్తారు.**

# అదనపు న్యాయమూర్తుల ప్రమాణ స్వీకారం



ఈ కబురు, హైదరాబాద్: తెలంగాణ హైకోర్టుకు కొత్తగా నియమితులైన నలుగురు అదనపు న్యాయమూర్తులు గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. న్యాయవాదుల కోటా నుంచి నియమితులైన గౌస్ మీరా మొహినుద్దీన్, సుద్దాల చలపతిరావు, వాకిటి రామకృష్ణారెడ్డి, గాడి ప్రవీణ్‌కుమార్‌లతో హైకోర్టు మొదటి కోర్టు హాలులో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్ ప్రమాణం చేయించారు. కార్యక్రమానికి న్యాయమూర్తులు, అదనపు న్యాయమూర్తుల బంధువులు, సన్నిహితులు, అడ్వొకేట్ జనరల్ ఎ.సుదర్శన్‌రెడ్డి, అదనపు సొలిసిటర్ జనరల్ బి.నరసింహశర్మ, బార్ కౌన్సిల్ ఛైర్మన్ ఎ.నరసింహారెడ్డి, పబ్లిక్ ప్రాసిక్యూటర్ పల్లె నాగేశ్వరరావు, అదనపు అడ్వొకేట్ జనరల్లు మహమ్మద్ ఇమ్రాన్‌ఖాన్, తేరా రజనీకాంత్‌రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్ తదితరులు పాల్గొన్నారు. ప్రమాణ స్వీకార కార్యక్రమం అనంతరం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్‌తో... జస్టిస్ గౌస్ మీరా మొహినుద్దీన్, జస్టిస్ పి.శ్యాం కోశీతో... జస్టిస్ సుద్దాల చలపతిరావు, జస్టిస్ అభినంద్‌కుమార్ షావిలితో... జస్టిస్ వాకిటి రామకృష్ణారెడ్డి, జస్టిస్ మౌసమీ భట్టాచార్యతో... జస్టిస్ గాడి ప్రవీణ్‌కుమార్‌లు కేసుల విచారణ చేపట్టారు

## బీసీలపై కాంగ్రెస్, భారత రాష్ట్ర సమితిల మోసాన్ని ఎండగడతాం



ఈ కబురు ,హైదరాబాద్: కాంగ్రెస్, భారత రాష్ట్ర సమితిలు బీసీలను మోసం చేస్తున్న తీరును ఆగస్టు 2న హైదరాబాద్‌లో తాము నిర్వహించనున్న మహాధర్నాలో ఎండగడతామంటూ భాజపా రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు స్పష్టంచేశారు. గురువారం ఆయన హైదరాబాద్‌లోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఓబీసీ మోర్చా నేతలు, యువ మోర్చా ఆఫీస్ బేరర్లతో సమావేశమయ్యారు. అనంతరం మీడియాతో రామచందర్‌రావు మాట్లాడుతూ... ''బీసీలకు 42% రిజర్వేషన్ కల్పిస్తామంటూ కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి డిక్లరేషన్ తీసుకొచ్చింది. దాన్ని అమలు చేయడం మాత్రం తమ పరిధిలో లేదనడం ప్రజల్ని అవమానించడమే. రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో ఉన్న ఏఒక్క అంశాన్నీ అమలు చేయకుండా బీసీలను మోసం చేస్తున్నారు. మాజీ సీఎం కేసీఆర్ కుమార్తె కవిత ఇప్పుడు బీసీల హక్కుల కోసం మాట్లాడుతున్నారు. ఆమె రాజకీయంగా వేదిక కల్పించుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. కాంగ్రెస్, భారత రాష్ట్ర సమితిల నిజస్వరూపాన్ని బయటపెట్టేందుకు ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో శనివారం ఇందిరాపార్కు ధర్నాచౌక్ వద్ద బీసీల హక్కుల కోసం మహాధర్నా చేపట్టనున్నాం. ఇందులో పార్టీ జాతీయ, రాష్ట్రస్థాయి ముఖ్యనేతలంతా పాల్గొంటారు. 2008 మాలేగావ్ పేలుళ్ల కేసులో ముంబయిలోని ఎన్ఐఏ కోర్టు... కుట్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న ఏడుగురు నిందితులను నిర్దోషులుగా ప్రకటించింది. ఈ తీర్పును స్వాగతిస్తున్నాం. రాష్ట్రంలో భారత రాష్ట్ర సమితి నుంచి గెలిచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేల అనర్హతపై దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును సైతం స్వాగతిస్తున్నాం'' అని అన్నారు.

మొదటి పేజీ తరువాయి

# రష్యా, భారత్‌లపై నోరు పారేసుకున్న ట్రంప్



**జట్టుకట్టి మరింత దిగజారుతున్నాయని విమర్శ**

**ఆ రెండు దేశాల వాణిజ్య బంధాన్ని పట్టించుకోనని వ్యాఖ్య**

ఈ కబురు ,వాషింగ్టన్/న్యూఢిల్లీ/మాస్కో: ఆంక్షలు విధిస్తామని భయపెట్టినా గత కొంతకాలంగా రష్యా నుంచి భారీ ఎత్తున చమురు కొనుగోళ్లను తగ్గించుకోని భారత్‌పై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మరోమారు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. భారత్‌కు చమురును సరఫరాచేస్తున్న శత్రు దేశం రష్యాను సైతం ట్రంప్ తనదైన శైలిలో విమర్శలు గుప్పించారు. భారత్, రష్యా రెండూ కలిసి సాధించేది ఏమీ ఉండదని ఎద్దేవాచేశారు. జట్టుకట్టి అనవసరంగా రెండు దేశాల ఆర్థికవ్యవస్థలను మరింత నిర్వీర్యంచేస్తున్నాయని ఇరు దేశాల ప్రభుత్వాలపై విమర్శల బురద చల్లారు. భారత్‌పై పాతికశాతం టారిఫ్ ఆర్థిక భారం మోపిన ట్రంప్ గురువారం భారత్, రష్యాల వాణిజ్యబంధంపై తన అక్కసును వెళ్లగక్కుతూ సొంత సామాజిక మాధ్యమం 'ట్రూత్ సోషల్'లో పలు పోస్ట్‌లు పెట్టారు.

### ఐ డోంట్ కేర్..

''రష్యాతో భారత్ ఎలాంటి వాణిజ్య ఒప్పందాలు చేసుకుంటోందీ, రష్యాతో భారత్‌కు ఉన్న సత్సంబంధాలు ఏంటి అనేవి నాకు అస్సలు అవసరం లేదు. అత్యంత కీలకమైన అమెరికాతో వాణిజ్యం అత్యల్ప స్థాయిలో చేసుకుంటూ భారత్ సొంత ఆర్థిక వ్యవస్థను నిర్వీర్యంచేసుకుంటోంది. ఇక రష్యా సంగతి చెప్పనక్కర్లేదు. రష్యాతో అమెరికాకు ఎలాంటి వాణిజ్య సంబంధాలు లేవు.

ఇలాంటి రష్యా, భారత్‌లో కూడబలుక్కుని సాధించింది ఏమీ లేదు. అవి రెండూ డెడ్ ఎకానమీలు (నిర్వీర్యమైన ఆర్థిక వ్యవస్థలు). ఉమ్మడిగా పతనమవుతున్నాయి. ఈ దేశాలను నేనసలు పట్టించుకోను. భారత్‌తో మేం చాలా తక్కువ స్థాయిలో వాణిజ్యం చేస్తున్నాం. భారత్ మాపై విధించే అధిక టారిఫ్‌లే ఇందుకు ప్రధాన కారణం. భారత్ విధించే దిగుమతి సుంకాలు చాలా ఎక్కువగా ఉంటాయి. ప్రపంచంలో అత్యధిక దిగుమతి సుంకాలు వసూలుచేస్తున్న దేశాల్లో భారత్ కూడా ఒకటి. భారత్‌తో వ్యవహారాలు ఒక్కోసారి సవ్యంగా ఉండవు. దాని పర్యవసానమే ఈ 25 శాతం దిగుమతి సుంకాలు. వీటికి పెనాల్టీ(జరిమానా) అదనం. ఇవన్నీ ఆగస్ట్ ఒకటో తేదీ నుంచి అమలుచేసి వసూలు మొదలెడతా'' అని ట్రంప్ వ్యాఖ్యానించారు. ''భారత వాణిజ్య విధానాలు అసంపూర్ణంగా, అస్పష్టంగా ఉంటాయి. దానికితోడు భారత్‌తో పరస్పర సరుకుల విలువను మాత్రమే జమకట్టే నగదుయేతర వాణిజ్య అవరోధాలు చాలా ఉన్నాయి. మేం వద్దు అని వారిస్తున్నా, హెచ్చరిస్తున్నాసరే రష్యా నుంచి ఆయుధ, ఇంధన ఉత్పత్తులను భారీ ఎత్తున భారత్ కొనుగోలుచేస్తోంది. ఇలా వచ్చిన ఆదాయాన్ని పరోక్షంగా ఉక్రెయిన్ యుద్ధం కోసం రష్యా వినియోగిస్తోంది'' అని ట్రంప్ ఆరోపించారు.

**మెద్వెదేవ్, ట్రంప్ మాటల యుద్ధం**

భారత్‌ను విమర్శించిన ట్రంప్ పనిలోపనిగా రష్యాపైనా, రష్యా మాజీ అధ్యక్షుడు దిమిత్రీ మెద్వదేవ్‌పైనా విమర్శలు గుప్పించారు. దీంతో మెద్వదేవ్ సైతం ప్రతివిమర్శలు చేశారు. తొలుత మెద్వదేవ్‌నుద్దేశిస్తూ ట్రంప్ వ్యంగ్య పోస్ట్ చేశారు. ''రష్యా అధ్యక్షుడిగా పేలవంగా పాలించిన మాజీ అధ్యక్షుడు మెద్వదేవ్ ఇంకా రష్యాకు అధ్యక్షుడినే అని అనుకుంటున్నారేమో. ఏదైనా మాట్లాడేముందు చూసి మాట్లాడండి. అమెరికాపై మాట్లాడే దుస్సాహసం చేయొద్దు'' అని హెచ్చరించారు. దీనిపై రష్యా భద్రతా మండలి ఉపాధ్యక్షుడి హోదాలో మెద్వదేవ్ ఘాటుగా జవాబిచ్చారు. ''ట్రంప్ ఎలా స్పందించినాసరే రష్యా తన పంథాను వీడబోదు. డెడ్ ఎకానమీ అని నోటికొచ్చినట్లు మాట్లాడటంకాదు. సోవియట్ కాలంలోనే రష్యా అణుబాంబును తయారుచేసిందన్న విషయం మర్చిపోవద్దు. అయినా 'డెడ్' అనే పదానికి 'ది వాకింగ్ డెడ్' అనే సినిమాకు, 'డెడ్ హ్యాండ్ అనే 'వ్యవ స్థ'కు ఉన్న శక్తి ట్రంప్‌కు తెలీదనుకుంటా'' అని మెద్వదేవ్ వ్యాఖ్యానించారు. శత్రుదేశం దాడిచేసి రష్యా నాయకత్వాన్ని అంతమొందించినాసరే తిరిగి అణు బాంబులు ప్రయోగించేలా రష్యా రూపొందించిన ఆటోమేటిక్ దాడి వ్యవస్థ పేరే డెడ్ హ్యాండ్.

# సవరణపై సభా సమరం



**బిహార్‌లో ఓటర్ల జాబితా సవరణ ఆపాల్సిందేనన్న విపక్షాలు**

**ప్రభుత్వం ఆ మేరకు నిర్ణయం తీసుకోవాలంటూ డిమాండ్**

**కొనసాగిన విపక్షసభ్యుల ఆందోళనలు, నినాదాలు**

**అర్ధంతరంగా వాయిదాపడిన ఇరుసభలు**

ఈ కబురు,న్యూఢిల్లీ: కేంద్ర ఎన్నికల సంఘం బిహార్‌లో చేపట్టిన వివాదాస్పద ఓటర్ల జాబితా సమగ్ర సవరణ క్రతువును తక్షణం నిలిపివేయాలన్న విపక్షాల డిమాండ్లతో పార్లమెంట్ ఉభయ సభలు దద్దరిల్లిపోయాయి. గురువారం ఉదయం రాజ్యసభలో సభాకార్యకలాపాలు మొదలవగానే విపక్షసభ్యులు తమ డిమాండ్లను నినాదాల రూపంలో వినిపించారు. ఆపరేషన్ సిందూర్‌పై 16 గంటల చర్యకు ప్రధాని మోదీ ఎందుకు రాజ్యసభలో సమాధానం ఇవ్వలేదని విపక్ష సభ్యులు ప్రశ్నిస్తూ సభాకార్యకలాపాలను అడ్డుకున్నారు. బిహార్‌లో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణను ఈసీ వెంటనే ఆపేయాలనీ విపక్ష సభ్యులు డిమాండ్‌చేశారు. దీంతో సభను సభాధ్యక్షుడు మధ్యాహ్నం 2 గంటలవరకు వాయిదావేశారు. తర్వాత సభ మొదలైనా మళ్లీ ఇదే విపక్షాల డిమాండ్ల పర్వం కొనసాగింది. వెంటనే ప్రధాని మోదీ సభకు వచ్చి ఆపరేషన్ సిందూర్‌పై సమాధానం ఇవ్వాలని విపక్ష సభ్యులు నినాదాలుచేశారు. ఈ సందర్భంగా రాజ్యసభలో విపక్షనేత మల్లికార్జున ఖర్గే మాట్లాడేందుకు సభాధ్యక్షుడు సస్మిత్ పాత్రా అనుమతించారు. '' 2008లో ముంబై ఉగ్రదాడులపై నాటి ప్రధాని మన్మోహన్ సింగ్ రాజ్యసభలో వివరణ ఇవ్వనప్పుడు నాటి హోం మంత్రి వివరణ ఇచ్చారు. అంతేగానీ హోం మంత్రి అమిత్ షా లాగా ''నేనొక్కడినే మీ అందరినీ అదమాయించగలను. హ్యాండిల్ చేస్తాను'' అని అందర్నీ తూలనాడలేదు. ఇప్పటికైనా ప్రధాని మోదీ సభకు వచ్చి మాట్లాడాలి'' అని ఖర్గే డిమాండ్‌చేశారు. ఈయన మాటలకు విపక్షసభ్యులు గొంతు కలిపారు. దీంతో చేసేదిలేక సభను సాయంత్రం నాలుగున్నర గంటలదాకా వాయిదావేశారు. 4.30 గంటలకు సభ మొదలయ్యాక ట్రంప్ చేసిన 'డెడ్ ఎకానమీ' వ్యాఖ్యలకు వాణిజ్య మంత్రి గోయల్ ఘాటుగా స్పందిస్తూ ప్రకటనచేశారు. అయినాసరే విపక్షసభ్యులు తమ నినాదాలను ఆపకపోవడంతో చివరకు సభను శుక్రవారానికి వాయిదావేశారు.

**లోక్‌సభలోనూ అదే తీరు..**

లోక్‌సభలోనూ ఇవే దృశ్యాలు కనిపించాయి. లోక్‌సభ ఉదయం మొదలుకాగానే జీఎస్ఎల్‌వీ రాకెట్ ద్వారా నైసార్ ఉపగ్రహాన్ని విజయవంతంగా ప్రయోగించిన శాస్త్రవేత్తలకు సభ అభినందించింది. తర్వాత వెంటనే బిహార్ అంశంపై విపక్ష సభ్యులు నినాదాలు మొదలెట్టారు. '' ఇలా నినాదాలు చేయడానికి మనల్ని ఓటర్లు ఓట్లేసి గెలిపించుకున్నారా? దయచేసి మీమీ సీట్లలో కూర్చోండి'' అని లోక్‌సభ స్పీకర్ బిర్లా మందలించారు. అయినా విపక్షసభ్యులు వినిపించుకోలేదు.

తొలుత రెండు గంటల దాకా సభ వాయిదాపడింది. తర్వాత ఇదే పునరావృతంకావడంతో అప్పుడు సభాధ్యక్ష స్థానంలో కూర్చున్న అవదేశ్ ప్రసాద్ సభను నాలుగు గంటలకువాయిదావేశారు. నాలుగు గంటలకు సభ మొదలవగానే మంత్రి పియూశ్ గోయల్ మాట్లాడారు. ఆ తర్వాత నినాదాలు కొనసాగడంతో స్పీకర్ బిర్లా సభను శుక్రవారానికి వాయిదావేశారు.

మొదటి పేజీ తరువాయి

# కదం తొక్కుతున్న కృష్ణమ్మ



**శ్రీశైలం ప్రాజెక్టుకు 2,73,659 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో**

**సాగర్‌లో 26 గేట్ల నుంచి నీటి విడుదల**

ఈకబురు ,దోమలపెంట/నాగార్జునసాగర్: శ్రీశైలం ప్రాజెక్టుకు గురువారం రాత్రి 7 గంటల సమయంలో 2,73,659 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగింది. జూరాల ప్రాజెక్టు స్పిల్‌వే ద్వారా 1,79,316 క్యూసెక్కులు, విద్యుదుత్పత్తి చేస్తూ 25,205, సుంకేసుల నుంచి 69,138 క్యూసెక్కుల ప్రవాహం ఉంది. దీంతో ఎనిమిది గేట్లు పైకెత్తి స్పిల్‌వే ద్వారా 2,16,152 క్యూసెక్కుల నీటిని సాగర్‌కు విడుదల చేస్తున్నారు. మరోవైపు ఎడమగట్టు భూగర్భ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 35,315 క్యూసెక్కులు, ఏపీ జెన్‌కో పరిధిలోని కుడిగట్టు కేంద్రంలో ఉత్పత్తి చేస్తూ 30,764 క్యూసెక్కులు.. మొత్తం 66,079 క్యూసెక్కుల నీళ్లు అదనంగా సాగర్‌కు విడుదలవుతున్నాయి. ప్రస్తుతం శ్రీశైలం జలాశయంలో 882.7 అడుగుల నీటిమట్టం వద్ద 202.9673 టీఎంసీల నీటి నిల్వ ఉంది. గడిచిన 24 గంటల వ్యవధిలో పోతిరెడ్డిపాడు ద్వారా 31,000 క్యూసెక్కులు, హెచ్ఎన్ఎస్ఎస్ లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా 2,818, ఎంజీకేఎల్ఐకి 1,600 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

సాగర్‌లో కృష్ణమ్మ పరవళ్లు

ఎగువ నుంచి వరద భారీగా వస్తుండటంతో నాగార్జునసాగర్ ప్రాజెక్టు వద్ద కృష్ణమ్మ పరవళ్లు కొనసాగుతున్నాయి. శ్రీశైలం నుంచి నాగార్జునసాగర్ జలాశయానికి వస్తున్న నీటితో.. సాగర్ నుంచి 26 క్రస్ట్‌గేట్ల ద్వారా, విద్యుదుత్పాదనతో కలిపి మొత్తం 2,25,595 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. సాగర్ జలాశయం గరిష్ఠ నీటిమట్టం 590 అడుగులు (312.0450టీఎంసీలు) కాగా.. ప్రస్తుతం 585 అడుగులు (297.4350టీఎంసీలు) ఉంది.

## నవ్వంటే ఆమెకు ప్రాణం.. అందుకే నోటికి రూ.16.5 కోట్ల ఇన్సూరెన్స్

ఆరోగ్య బీమా, జీవిత బీమా.. ఈ పదాలను మనం నిత్యం వింటుంటాం. అయితే ఓ నటి మాత్రం తన నోటికి బీమా చేయించుకున్నారు. ఎంతో ఇష్టమైన తన నవ్వుకోసం ఏకంగా రూ.16.5 కోట్లు ఖర్చుపెట్టారు. ఆమే బ్రిటిష్ నటి, సింగర్ సింథియా ఎరివో మీడియా కథనాల ప్రకారం..మౌత్‌వాష్ బ్రాండ్ లిస్టెరిన్ నిర్వహిస్తోన్న 'వాష్ యువర్ మౌత్' కార్యక్రమానికి ఈమె ప్రచారకర్తగా ఉన్నారు. అలాగే నోటి శుభ్రతకు ఆమె అత్యంత ప్రాధాన్యం ఇస్తారు. తన నవ్వు, గొంతుకు ఉన్న ప్రత్యేకత కారణంగానే వృత్తి, వ్యక్తిగత జీవితంలో రాణిస్తున్నానని వెల్లడించారు. ఇక, ఆమె వేదిక ఎక్కేముందు ప్రతిసారి బ్రష్ చేసుకొని, మౌత్ వాష్ వాడుతుంటారట. అది తనలో ఆత్మవిశ్వాసం పెంచుతుందని చెప్తుంటారు. తన రెండు దంతాల మధ్య ఉన్న గ్యాప్‌ను, తన విలక్షణ నవ్వు, గళాన్ని కాపాడుకునేందుకు ఈ బీమా వైపు మొగ్గు చూపానని వెల్లడించారు.బ్రిటన్‌కు చెందిన 38 ఏళ్ల సింథియా నటన, గాత్రంతో ఎంతోమంది అభిమానులను సంపాదించుకున్నారు. ఎమ్మీ, గ్రామీ, ఆస్కార్, టోనీవంటి ప్రతిష్ఠాత్మక అవార్డులకు నామినేషన్లను పొందారు. వాటిల్లో ఆస్కార్ తప్ప మిగతావాటిని ఆమె అందుకున్నారు. ఆమె నటించిన విక్డ్: ఫర్ గుడ్, చిల్డ్రన్ ఆఫ్ బ్లడ్ అండ్ బోన్ చిత్రాలు త్వరలో విడుదల కానున్నాయి. ఇక ఆమె ఇన్సూరెన్స్ నిర్ణయం అందరి దృష్టిని ఆకర్షించింది. దీంతో ఆమెను హాలీవుడ్‌లో 'అత్యంత విలువైన చిరునవ్వు' కలిగిన మహిళగా పిలుచుకుంటున్నారు.ఇక ఇలా శరీరాభాగాలను ఇన్సూరెన్స్ చేయించుకున్న సెలబ్రిటీలు చాలామందే ఉన్నారు. జెన్నిఫర్ లోపెజ్ తన వీపు భాగాన్ని రూ. 200కోట్లకు బీమా చేయించారని గతంలో వార్తలు వచ్చాయి. అమెరికన్ సింగర్ మారియా కరే తన కాళ్లు, స్వరపేటికల కోసం రూ.500 కోట్లకు ఇన్సూరెన్స్ తీసుకున్నారు. ఫుట్‌బాల్ దిగ్గజాలు క్రిస్టియానో రొనాల్డో, డేవిడ్ బెక్‌హామ్ తమ కాళ్లకు బీమా తీసుకున్నారు. బ్రిటిష్ సెలబ్రిటీ చెఫ్ గోర్డన్ రామ్‌సే తన నాలుకు ఇన్సూరెన్స్ తీసుకోవడం గమనార్హం.

# ఎగుమతులకు టారిఫ్‌ల సెగ

**అమెరికా సుంకాలతో పలు రంగాలపై తీవ్ర ప్రభావం**
**టెక్స్‌టైల్స్, రత్న ఆభరణాలు తదితర పరిశ్రమలకు దెబ్బ**
**ఉపాధి అవకాశాలపైనా ఎఫెక్ట్..**
**నిపుణులు, పరిశ్రమ వర్గాల విశ్లేషణ**




భారత ఎగుమతులపై అమెరికా ఎకాయెకిన 25 శాతం టారిఫ్‌లు ప్రకటించడం దేశీ పరిశ్రమలకు శరాఘాతంగా తగిలింది. దీనితో అమెరికన్ మార్కెట్‌పైనే ఎక్కువగా ఆధారపడుతున్న రత్నాభరణాలు, టెక్స్‌టైల్స్, ఫార్మా తదితర పలు పరిశ్రమలపై తీవ్ర ప్రతికూల ప్రభావం పడుతుందనే భయాలు నెలకొన్నాయి. అలాగే పలు రంగాల్లో భారీగా ఉపాధి అవకాశాలకు కూడా కోత పడొచ్చనే ఆందోళన వ్యక్తమవుతోంది. అమెరికాకు కనీసం 25 శాతం ఎగుమతులు తగ్గినా, వాణిజ్య ఆదాయాలపరంగా ఏటా 21.75 బిలియన్ డాలర్ల మేర నష్టం వాటిల్లుతుందని అంచనా.

ఎగుమతుల ద్వారా వచ్చే ఆదాయాలు తగ్గడం వల్ల మన రూపాయి మారకం విలువ కూడా క్షీణించే అవకాశం ఉంది. అటు స్టాక్ మార్కెట్లపరంగా చూస్తే ఎగుమతుల ఆధారిత రంగాలకు చెందిన (టెక్స్‌టైల్స్, జ్యుయలరీ మొదలైనవి) సంస్థల షేర్లు తగ్గొచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో అమెరికాతో మన వాణిజ్యం, టారిఫ్‌లపై వివిధ రంగాలపై పడే ప్రభావాలపై ఈ ప్రత్యేక కథనం.

రత్నాభరణాలు: రత్నాభరణాల పరిశ్రమ మొత్తం ఎగుమతుల్లో 30 శాతం వాటా అమెరికాదే ఉంటోంది. అగ్రరాజ్యానికి ఎగుమతులు సుమారు 10 బిలియన్ డాలర్లుగా ఉంటున్నాయని రత్నాభరణాల ఎగుమతుల మండలి జీజేఈపీసీ చైర్మన్ కిరీట్ భన్సాలీ తెలిపారు. భారీ స్థాయిలో టారిఫ్‌లు విధించడం వల్ల వ్యయా పెరిగిపోవడానికి, ఎగుమతుల్లో జాప్యానికి దారి తీస్తుందని, చిన్న స్థాయి వ్యాపారుల నుంచి భారీ తయారీ సంస్థల వరకు అందరిపైనా ప్రభావం పడుతుందని పేర్కొన్నారు. ఎగుమతులు పడిపోవడం, ఆర్డర్లు రద్దు కావడం, ఎగుమతిదారుల మార్జిన్లు తగ్గిపోవడం వంటి పరిణామాలు చోటు చేసుకుంటాయని రిద్ధిసిద్ధి బులియన్స్ (ఆర్ఎస్‌బీఎల్) ఎండీ పృథ్వీ రాజ్ కొఠారీ చెప్పారు. గత ఆర్థిక సంవత్సరంలో భారత్ దాదాపు 2.3 బిలియన్ డాలర్ల విలువ చేసే రొయ్యలను అమెరికా మార్కెట్‌కు ఎగుమతి చేసింది. అమెరికాకు మొత్తం సీఫుడ్ ఎగుమతుల్లో ఇది 90 శాతం కావడం గమనార్హం. ఆంధ్రప్రదేశ్ నుంచి కూడా ఎగుమతులు ఉంటుండటంతో తెలుగువారిపైనా ఈ ప్రభావం పడొచ్చని అంచనా. ఈ విభాగంలో మనతో పోలిస్తే టారిఫ్‌లు తక్కువగా ఉన్న ఈక్వెడార్‌తో పోటీ తీవ్రమయ్యే ప్రమాదం ఉంది. అయితే, బ్రిటన్‌తో ఇటీవలే వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోవడంతో అమెరికా టారిఫ్‌ల ప్రభావం కాస్త తగ్గే అవకాశం ఉందని భావిస్తున్నారు.

**ఫార్మా.. మెడికల్ డివైజ్‌లు..**

చౌక జనరిక్స్ ఔష ధాలకు సంబంధించి అమెరికా అవసరాల్లో దాదాపు 47 శాతాన్ని భారత్ తీరుస్తోంది. టారిఫ్‌లతో ఎగుమతులపై ప్రభావం పడితే భారత ఫార్మా సంస్థల లాభాలు తగ్గుతాయి. పరిశోధన, అభివృద్ధి కార్యకలాపాలు నెమ్మదిస్తాయని, కొత్త ఔషధాలకు అనుమతులు నిలిచిపోతాయని, అలాగే కొత్త ఆవిష్కరణలపై ఎఫెక్ట్ పడుతుందని భారతీయ మెడికల్ డివైజ్‌ల పరిశ్రమ సమాఖ్య ఏఐఎంఈడీ ఫోరం కోఆర్డినేటర్ రాజీవ్ నాథ్ తెలిపారు. అయితే, టారిఫ్‌లపరంగా చైనా, భారత్ మధ్య 15-20 శాతం మేర వ్యత్యాసం కొనసాగినంత కాలం మెడికల్ డివైజ్‌ల పరిశ్రమకు కాస్త సానుకూలంగానే ఉంటుందని పేర్కొన్నారు.

**ఇంజనీరింగ్ ఉత్పత్తులు..**

- గణాంకాల ప్రకారం అమెరికాకు ఇంజినీరింగ్ ఉత్పత్తుల ఎగుమతులు 18.3 బిలియన్ డాలర్ల స్థాయిలో నమోదయ్యాయి. మన ఉత్పత్తులు ఖరీదుగా మారితే అమెరికన్లు మెక్సికోలాంటి దేశాలవైపు మళ్లొచ్చు. దీనితో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటున్న మేకిన్ ఇండియా కార్యక్రమానికి విఘాతం కలగవచ్చు.

**వ్యవసాయ ఉత్పత్తులు..**

- అమెరికాకు మన వ్యవసాయోత్పత్తుల ఎగుమతులు 5.6 బిలియన్ డాలర్ల స్థాయిలో ఉన్నాయి. సుంకాలతో భారత్ నుంచి ఆహార పదార్థాల ధరలు పెరిగిపోయి, అమెరికన్లు దిగుమతులను తగ్గించుకోవచ్చు. ప్రత్యామ్నాయ మార్కెట్ల వైపు మళ్లొచ్చు. దీనితో రైతులు, ఎగుమతిదార్లపై ప్రభావం పడొచ్చు.

**ఉక్కు, రసాయనాలు, పెట్రోలియం ఉత్పత్తులు..**

అమెరికాకు ఈ ఉత్పత్తుల ఎగుమతులు 8 బిలియన్ డాలర్ల పైగా ఉన్నాయి. టారిఫ్‌లతో వల్ల వియత్నాం, బ్రెజిల్‌లాంటి దేశాలు పోటీకి రావడం వల్ల మన దగ్గర ఈ రంగంలోని బడా కంపెనీలతో పాటు చిన్న, మధ్య తరహా సంస్థలపైనా ప్రభావం పడుతుంది.

మొత్తం ఎగుమతుల్లో అయిదో వంతు వాటాతో భారత్‌కు అమెరికా కీలకంగా ఉంటోంది.

- భారీగా ఉపాధి కల్పించే టెక్స్‌టైల్స్, వ్యవసాయం, లెదర్, రత్నాభరణాల్లాంటి పరిశ్రమల నుంచి 2025 ఆర్థిక సంవత్సరంలో ఎగుమతుల్లో అమెరికా వాటా ఏకంగా 35 శాతంగా నమోదైంది. టారిఫ్‌లతో ఈ పరిశ్రమలు దెబ్బతింటే, ఉపాధి అవకాశాలపై కూడా దాని ప్రభావం పడే అవకాశం ఉంది. రత్నాభరణాల పరిశ్రమలో 1 లక్ష పైగా ఉద్యోగాలపై ప్రభావం పడొచ్చని అంచనా.

- గత ఆర్థిక సంవత్సరంలో అమెరికాకు భారత్ 87 బిలియన్ డాలర్ల విలువ చేసే ఉత్పత్తులను ఎగుమతి చేయగా, 46 బిలియన్ డాలర్ల మేర దిగుమతులు చేసుకుంది. అమెరికాతో వాణిజ్యంలో భారత్‌కు సుమారు 41 బిలియన్ డాలర్ల మేర మిగులు ఉంది. అటు సర్వీసులపరంగా చూసినా అమెరికాకు 2023లో 36.4 బిలియన్ డాలర్ల ఎగుమతులు చేయగా, 34 బిలియన్ డాలర్ల దిగుమతులు చేసుకుంది. భారత్ పక్షాన సుమారు 2.4 బిలియన్ డాలర్ల మిగులు నమోదైంది.

**అమెరికన్లకూ 'చేదు' మాత్రే ..**

అమెరికా టారిఫ్‌లు భారత్‌కి కొంత సమస్యాత్మకమే అయినప్పటికీ, దీర్ఘకాలంలో వాటి ప్రభావం అమెరికన్లపైనే ఎక్కువగా ఉంటుందని నిపుణులు, పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. భారత్ నుంచి వచ్చే ఉత్పత్తులపై సుంకాలు విధించడం వల్ల, అక్కడ వాటి ధరలు పెరిగిపోయి స్థానికులు మరింతగా వెచ్చించాల్సి వస్తుందని ఫార్మా ఎగుమతి సంస్థల సమాఖ్య ఫార్మెక్సిల్ చైర్మన్ నమిత్ జోషి తెలిపారు. భారీ ఎత్తున, నాణ్యమైన ఔషధాలను చౌకగా అందించే ప్రత్యామ్నాయాలను ఇప్పటికిప్పుడు దొరకపుచ్చుకోవడం పెద్ద సవాలుగానే ఉంటుందని చెప్పారు.

**ఏయే పరిశ్రమలకు ప్రతికూలం..**
**టెక్స్‌టైల్స్/దుస్తులు , రత్నాభరణాలు**
**ఫార్మా , వాహనాలు, ఆటో విడిభాగాలు**
**ఎలక్ట్రానిక్స్/మొబైల్ డివైజ్‌లు**
**ఇంజనీరింగ్ ఉత్పత్తులు/మెటల్స్**
**సీఫుడ్/అగ్రి ఎగుమతులు**

**టెక్స్‌టైల్స్..**

టారిఫ్‌ల వల్ల భారతీయ టెక్స్‌టైల్స్ ఎగుమతిదారులపై గణనీయంగానే ప్రతికూల ప్రభావం పడుతుందని విశ్లేషకులు తెలిపారు. మనతో పోలి స్తే వియత్నాం, ఇండొనేషియాలాంటి దేశాలపై తక్కువ సుంకాలు ఉండటం వల్ల వాటి నుంచి మరింత పోటీని ఎదుర్కొనాల్సి వస్తుందని పేర్కొన్నా రు. ఆర్డర్లు రద్దు కావడం, ధర లు తగ్గించాలంటూ ఒత్తిడి పెరగడంలాంటి పరిణామాలు చోటు చేసుకోవచ్చని ట్రేడ్ ఇంటెలిజెన్స్ సంస్థ సైబెక్స్ ఎగ్జిమ్ సొల్యూషన్స్ తెలిపింది. బంగ్లాదేశ్, వియత్నాంలాంటి దేశా ల నుంచి పోటీ పెరిగి, చిన్న తయారీ సంస్థలపై ఒత్తిడి పెరుగుతుందని పేర్కొంది.

ఈ నేపథ్యంలో బ్రిటన్, యూరోపియన్ యూనియన్, జపాన్‌లాంటి ఇతర మార్కెట్లపై కూడా మరింతగా దృష్టి పెట్టాలని భారతీయ టెక్స్‌టైల్ పరిశ్రమ సమాఖ్య (సీఐటీఐ) సెక్రటరీ జనరల్ చంద్రిమా చటర్జీ చెప్పారు. భారత టెక్స్‌టైల్స్, దుస్తులకు అమెరికా అతి పెద్ద మార్కెట్‌గా ఉంటోంది. 17 బిలియన్ డాలర్ల రెడీమేడ్ దుస్తుల ఎగుమతుల్లో 5.6 బిలియన్ డాలర్ల ఉత్పత్తులు అమెరికాకే ఎగుమతవుతున్నాయి. టెక్స్‌టైల్స్, అపారెల్ పరిశ్రమ ద్వారా దాదాపు 4.5 కోట్ల మంది ఉపాధి పొందుతున్నారు. పరిశ్రమ దెబ్బతింటే వీరి ఉపాధిపైనా ప్రభావం పడుతుంది.

**ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్ పరికరాలు..**

టెలికం పరికరాలు, మొబైల్ ఫోన్స్, సర్క్యూట్ బోర్డులాంటి ఉత్పత్తుల ఎగుమతులు 12 బిలియన్ డాలర్ల స్థాయిలో ఉంటున్నాయి. టారిఫ్‌ల వల్ల చౌకగా లభించే ఎలక్ట్రానిక్స్ విషయంలో మిగతా దేశాలతో భారత్ పోటీ పడే సామర్థ్యం తగ్గుతుంది. దీనితో ఎలక్ట్రానిక్స్ ఎగుమతులు నెమ్మదించవచ్చు.




## ఎయిర్‌టెల్ కొత్త రీచార్జ్ ప్లాన్.. ఓటీటీలన్నీ ఫ్రీ..

ఓటీటీ వినియోగదారుల కోసం టెలికాం కంపెనీలు అనేక ప్లాన్లను అందిస్తున్నాయి. అయితే ఇలాంటి ప్లాన్లలో చాలా వరకు ఖరీదైనవి లేదా ఒకటీ రెండు ఓటీటీ సర్వీసులకు మాత్రమే యాక్సెస్ కల్పిస్తాయి. కానీ ఎయిర్‌టెల్ ఓటీటీ వినియోగదారుల కోసం ప్రత్యేక రీఛార్జ్ ప్లాన్‌ను ప్రవేశపెట్టింది. ఇది ఒకటీ రెండు కాదు నెట్‌ఫ్లిక్స్, జియో హాట్‌స్టార్ సహా రెండు డజన్లకు పైగా ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లకు ఉచిత యాక్సెస్ అందిస్తుంది.

ఎయిర్‌టెల్ తన ప్రీపెయిడ్ పోర్ట్‌ఫోలియోలో ఎంపిక చేసిన ఆల్‌ఇన్‌వన్ ఓటీటీ ప్లాన్లను చేర్చింది. అంటే ఒక్క రీఛార్జ్ లో ఒకటీ రెండు కాదు అనేక ఓటీటీ ప్లాట్‌ఫామ్స్ కు యాక్సెస్ లభిస్తుంది. ఈ ప్లాన్ల జాబితాలో రూ .279 రీఛార్జ్ టారిఫ్ ఉంది. పూర్తి నెల వాలిడిటీతో వస్తుంది. దీనితో రీఛార్జ్ చేస్తే నెల రోజుల పాటు ఫుల్ ఆన్ ఎంటర్‌టైన్మెంట్ లభిస్తుంది.

**రూ.279తో ఆల్ ఇన్ వన్ ఓటీటీ ప్లాన్**

ఎయిర్‌టెల్ యూజర్లకు అందిస్తున్న ఈ ప్లాన్ డేటా బూస్టర్ లేదా డేటా ఓన్లీ ప్లాన్. కాబట్టి ఇందులో కాలింగ్ లేదా ఎస్ఎంఎస్ ప్రయోజనాలు ఉండవు. అయితే ఒక నెల వ్యాలిడిటీతో 1 జీబీ అదనపు డేటా లభిస్తుంది. వినియోగదారులు ఏదైనా యాక్టివ్ ప్లాన్‌తో దీన్ని రీఛార్జ్ చేసుకోవచ్చు.

ఈ ప్లాన్ అందిస్తున్న ఓటీటీ సేవల జాబితాలో నెట్‌ఫ్లిక్స్ బేసిక్, జియో హాట్‌స్టార్ సూపర్, జీ5 ప్రీమియం వంటి పెద్ద సబ్‌స్క్రిప్షన్లు ఉన్నాయి. వీటితో పాటు ఎయిర్‌టెల్ ఎక్స్‌స్ట్రీమ్ ప్లే ప్రీమియం సబ్‌స్క్రిప్షన్ కూడా అందుబాటులో ఉంది. దీనితో వినియోగదారులు 25 కంటే ఎక్కువ ఓటీటీ సేవల కంటెంట్‌ను చూడవచ్చు. ఎక్స్‌స్ట్రీమ్ ప్లే ప్రీమియంలో సోనీలివ్, లయన్స్‌గేట్ ప్లే, ఆహా, చౌపాల్, హోయిచోయ్ వంటి ప్లాట్‌ఫామ్‌లను చేర్చారు.

## నష్టాల్లో ముగిసిన మార్కెట్లు

భారత ఎగుమతులపై 25 శాతం సుంకం విధిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించడంతో బెంచ్ మార్క్ ఇండియన్ ఈక్విటీ సూచీలు గురువారం అస్థిర సెషన్ లో ప్రతికూలంగా ముగిశాయి. సెన్సెక్స్ 296.28 పాయింట్లు (0.36 శాతం) క్షీణించి 81,185.58 వద్ద స్థిరపడింది. గురువారం ఈ సూచీ 81,803.27 నుంచి 80,695.15 శ్రేణిలో ట్రేడ్ అయింది. నిఫ్టీ 50 కూడా 86.70 పాయింట్లు లేదా 0.35 శాతం క్షీణించి 24,768.35 వద్ద స్థిరపడింది.

సెన్సెక్స్ షేర్లలో టాటా స్టీల్, సన్ ఫార్మా, ఎన్టీపీసీ, అదానీ పోర్ట్స్, రిలయన్స్ ఇండస్ట్రీస్ 2.701.34 శాతం రేంజ్‌లో ముగిశాయి. హిందుస్థాన్ యూనిలీవర్, ఎటర్నల్, ఐటీసీ, కోటక్ మహీంద్రా, పవర్ గ్రిడ్ షేర్లు 3.61 శాతం వరకు లాభపడ్డాయి. నిఫ్టీ స్మాల్ క్యాప్ 100, నిఫ్టీ మిడ్ క్యాప్ 100 సూచీలు వరుసగా 1.05 శాతం, 0.93 శాతం నష్టపోయాయి.

రంగాలవారీగా చూస్తే నిఫ్టీ ఎఫ్ఎంసీజీ ఇండెక్స్ మార్కెట్ ధోరణులను అధిగమించి ఇమామీ, హిందుస్థాన్ యూనిలీవర్ నేతృత్వంలో 1.44 శాతం లాభాలతో స్థిరపడింది. నిఫ్టీ ఫార్మా, మెటల్, ఆయిల్ అండ్ గ్యాస్, హెల్త్ కేర్ సూచీలు 1 శాతానికి పైగా నష్టాల్లో ముగిశాయి. బీఎస్ఈలో ట్రేడైన 4,153 షేర్లలో 2,418 రెడ్‌లో, 1,598 గ్రీన్‌లో ముగిశాయి. 137 షేర్లలో ఎలాంటి మార్పు లేదు.





## పేటీఎంలో ప్రత్యేక డిస్కౌంట్ ఆఫర్లు

**రాఖీ, జన్మాష్టమి తదితర పండుగల సందర్భంగా ట్రావెల్ మెగా ఫెస్టివల్ సేల్ కింద ప్రయాణికులకు ప్రత్యేక డిస్కౌంట్లను అందిస్తున్నట్లు పేటీఎం (వన్97 కమ్యూనికేషన్స్) వెల్లడించింది. దీని ప్రకారం దేశీయంగా విమాన సర్వీసుల్లో 12%, అంతర్జాతీయ రూట్లలో 10%, బస్ బుకింగ్స్‌పై 20 % డిస్కౌంటు పొందవచ్చు.**

**అలాగే యూపీఐ ద్వారా రైలు బుకింగ్స్‌కి పేమెంట్ గేట్‌వే చార్జీలు ఉండవు. బ్యాంక్ ఆఫ్ బరోడా, ఐసీఐసీఐ బ్యాంక్, ఆర్‌బీఎల్ బ్యాంక్ కార్డుదారులు ప్రత్యేక రాయితీలు పొందవచ్చు. పేటీఎం ద్వారా బుక్ చేసుకున్న రైలు టికెట్లను రద్దు చేసుకుంటే 100% తక్షణ రీఫండ్‌తో, ఉచిత క్యాన్సిలేషన్ అవకాశాన్ని పొందవచ్చని సంస్థ తెలిపింది. జూలై 31 వరకు ఈ ఆఫర్ ఉంటుంది.**




## టాటా మోటార్స్ రూ. 10,000 కోట్ల సమీకరణ!




**ఈక్విటీ, దీర్ఘకాలిక రుణాలపై దృష్టి**
**ఇవెకో కొనుగోలుకు తీసుకునే తాత్కాలిక రుణాల తీర్చివేతపై కసరత్తు**

**న్యూఢిల్లీ:** ఇటలీ కంపెనీ ఇవెకో గ్రూప్ కొనుగోలు కోసం తీసుకుంటున్న స్వల్పకాలిక రుణాన్ని (బ్రిడ్జ్ ఫైనాన్సింగ్) తీర్చివేసేయడంపై టాటా మోటార్స్ కసరత్తు చేస్తోంది. ఇందులో భాగంగా సుమారు 1 బిలియన్ యూరోలను (సుమారు రూ. 10,000 కోట్లు) ఈక్విటీగా, మిగతా మొత్తాన్ని దీర్ఘకాలిక రుణాలుగా సమకూర్చుకునే యత్నాల్లో ఉన్నట్లు టాటా మోటార్స్ గ్రూప్ సీఎఫ్‌వో పీబీ బాలాజీ తెలిపారు. ఇవెకో డీల్ ముగిసిన 12-18 నెలల్లో ఈ ప్రక్రియ పూర్తి కావచ్చన్నారు. 3.8 బిలియన్ యూరోలతో (సుమారు రూ. 38,240 కోట్లు) వాణిజ్య వాహనాల కంపెనీ ఇవెకో గ్రూప్‌ను టాటా మోటార్స్ కొనుగోలు చేయనుంది. ఇందుకు మోర్గాన్ స్టాన్లీ, ఎంయూఎఫ్‌జీ తదితర సంస్థలు బ్రిడ్జ్ ఫైనాన్సింగ్ చేస్తున్నాయి.

**నాలుగో స్థానానికి...:** ఇన్వెస్టర్లతో సమావేశం సందర్భంగా వెల్లడించిన వివరాల ప్రకారం ఇవెకో కూడా కలిస్తే 6 టన్నుల ట్రక్కుల కేటగిరీలో టాటా మోటార్స్ గ్రూప్ మొత్తం అమ్మకాలు వార్షికంగా 2.3 లక్షల యూనిట్ల పైచిలుకు ఉంటుంది. తద్వారా దాదాపు వోల్వో గ్రూప్‌తో సమానంగా నాలుగో స్థానంలో ఉంటుంది. కొనుగోలుకు ముందు ఏటా 1.8 లక్షల యూనిట్లతో టాటా మోటార్స్ గ్రూప్ ఆరో స్థానంలో, 50,000 యూనిట్లతో ఇవెకో 17వ స్థానంలో ఉన్నాయి. తొలి మూడు స్థానాల్లో డైమ్లర్ గ్రూప్ (3.5 లక్షల యూనిట్లు), సీఎన్‌హెచ్‌టీసీ గ్రూప్ (2.5 లక్షలు), ట్రాటన్ గ్రూప్ (2.4 లక్షల యూనిట్లు) ఉన్నాయి. 2024 డిసెంబర్ నాటికి ఇవెకో సంస్థకు అంతర్జాతీయంగా 32,000 మంది ఉద్యోగులు ఉన్నారు.

## కాగ్నిజెంట్‌లో జీతాల పెంపు.. సీఎఫ్‌వో కీలక ప్రకటన




ఐటీ సేవల దిగ్గజం కాగ్నిజెంట్‌లో ఉద్యోగుల జీతాల పెంపుపై కీలక ప్రకటన చేశారు ఆ సంస్థ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ (సీఎఫ్‌వో) జతిన్ దలాల్. 2025 ద్వితీయార్థంలో చాలా మంది ఉద్యోగులకు వేతన పెంపును అమలు చేయాలని కంపెనీ యోచిస్తోందని, అయితే స్థూల ఆర్థిక అనిశ్చితి కొనసాగుతున్న నేపథ్యంలో వేతన పెంపు తేదీని ఇంకా నిర్ణయించలేదని జతిన్ దలాల్ జూలై 31న కంపెనీ క్యూ 2 ఎర్నింగ్ కాల్ సందర్భంగా చెప్పారు.

న్యూజెర్సీ కేంద్రంగా పనిచేస్తున్న కాగ్నిజెంట్ సాధారణంగా ఆగస్టు 1 నుంచి వార్షిక వేతన పెంపును ప్రారంభిస్తుంది. అయితే ఈ ఏడాది టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్), విప్రో, హెచ్‌సీఎల్‌టెక్, పెర్సిస్టెంట్ సిస్టమ్స్ వంటి సంస్థలతో కలిసి కాగ్నిజెంట్ వేతన ఇంక్రిమెంట్ల విషయంలో ఆచితూచి వ్యవహరిస్తోంది. 2026 ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు వేతన పెంపును అమలు చేసిన ఏకైక ప్రధాన టైర్ 1 ఐటీ సంస్థగా ఇన్ఫోసిస్ నిలిచింది.

స్థూల ఆర్థిక వాతావరణం, దాని చుట్టూ ఉన్న అనిశ్చితి దృష్ట్యా వేతనాల పెంపుపై ఇంకా నిర్ణయం తీసుకోలేదని దలాల్ పేర్కొన్నారు. ఈ ఏడాది ద్వితీయార్థంలో అమలు చేసే వేతన పెంపులో మెజారిటీ ఉద్యోగులను కవర్ చేయాలనేది తమ ప్రయత్నమని చెప్పారు. అనిశ్చిత వాతావరణం ఉన్నప్పటికీ, కాగ్నిజెంట్ స్థిరమైన హెడ్ కౌంట్ వృద్ధిని నివేదిస్తూనే ఉంది. ఏప్రిల్‌జూన్ త్రైమాసికంలో కంపెనీ వరుసగా 7,500 మంది ఉద్యోగులను చేర్చుకుంది, మొత్తం ఉద్యోగుల సంఖ్య 343,800 కు చేరుకుంది. అట్రిషన్ గత త్రైమాసికంతో పోలిస్తే 60 బేసిస్ పాయింట్లు తగ్గి పన్నెండు నెలల ప్రాతిపదికన 15.2 శాతానికి తగ్గింది.

## 'ఉదయం నుంచి నన్ను ఏడిపించేశారు'.. విజయ్ దేవరకొండ ఎమోషనల్



రౌడీ హీరో విజయ్ దేవరకొండ నటించిన యాక్షన్ థ్రిల్లర్ కింగ్‌డమ్. అభిమానుల భారీ అంచనాల మధ్య ఇవాళ ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదలైంది. యూఎస్‌తో పాటు తెలుగు రాష్ట్రాల్లోనూ ఫస్ట్ షో నుంచే పాజిటివ్ టాక్‌ను సొంతం చేసుకుంది. దీంతో కింగ్‌డమ్ మూవీ అంతా సక్సెస్ సంబురాల్లో మునిగిపోయింది. మూవీకి వస్తున్న రెస్పాన్స్ చూసి హైదరాబాద్‌లో సక్సెస్ ప్రెస్ మీట్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విజయ్ దేవరకొండ ఆసక్తికర కామెంట్స్ చేశారు.

మీ అందరి ప్రేమ, అభిమానం వల్లే ఇదంతా సాధ్యమైందని విజయ్ దేవరకొండ అన్నారు. మీ సపోర్ట్‌తో మరిన్ని మంచి సినిమాలు చేస్తానని తెలిపారు. ఉదయం నుంచి నాకు ఫోన్ చేసి అన్నా... మనం కొట్టినాం అని ఎంతోమంది నన్ను ఏడిపించేశారని ఎమోషనలయ్యారు. మా మేనేజర్ అనురాగ్ సైతం ఏడ్చేశారు. ఈ సినిమా విజయంతో నాకు బిగ్ రిలీఫ్ దక్కింది. నా వెనుక మీరు ఎంతమంది ఉన్నారో చూస్తూనే ఉన్నా.. నా ఫ్యాన్స్ అందరి ప్రేమ, ఆదరణ వెలకట్టలేనిది అన్నారు. యూఎస్ ఫ్యాన్స్‌ను తప్పకుండా కలుస్తా.. ఆగస్టులో అమెరికాకు వస్తా అని విజయ్ దేవరకొండ వెల్లడించారు.

## నేనేంటో నాకు తెలుసు.. క్యాస్టింగ్‌కౌచ్ ఆరోపణలపై విజయ్ సేతుపతి



ఎలాంటి సినీ నేపథ్యం లేకుండా ఇండస్ట్రీకి వచ్చి స్టార్‌గా ఎదిగారు నటుడు విజయ్ సేతుపతి. ఆయనపై ఓ మహిళ ఇటీవల సంచలన ఆరోపణలు చేసిన సంగతి తెలిసిందే. కోలీవుడ్‌లో క్యాస్టింగ్ కౌచ్ బాగా ఉందని ఆమె సోషల్‌మీడియాలో ఓ పోస్ట్ పెట్టారు. దీంతో ఈ అంశం తీవ్ర చర్చకు దారితీసింది. తాజాగా తనపై వచ్చిన ఆరోపణలపై విజయ్ సేతుపతి స్పందించారు. తన కుటుంబం ఎంతో బాధ పడిందన్నారు. ఆమెపై తన టీమ్ సైబర్‌క్రైమ్‌లో ఫిర్యాదు చేసిందన్నారు.

“నన్ను ఎన్నోఏళ్లుగా చూస్తున్నవారంతా ఆమె ఆరోపణలు చూసి నవ్వుకున్నారు. నేనేంటో నాకు తెలుసు. ఈ రకమైన తప్పుడు ఆరోపణలు నన్ను బాధించలేవు. కానీ, నా కుటుంబం, సన్నిహితులు ఎంతో కలత చెందారు. ‘వీటిని పట్టించుకోకండి. ఆమె ఫేమస్ కావడం కోసం కావాలని ఇలా చేస్తోంది. కొన్ని నిమిషాలపాటు హైలైట్ అవుతుంది. పాపం ఎంజాయ్ చేయనీయండి’ అని వారితో చెప్పాను. మేము ఆమెపై సైబర్ క్రైమ్‌లో ఫిర్యాదు చేశాం. ఏడు సంవత్సరాలుగా నేను ఎన్నో ఒడుదొడుకులు ఎదుర్కొన్నాను. ఇప్పటివరకూ దేనికీ భయపడలేదు. ఇలాంటివి ఎప్పటికీ నన్ను బాధించవు” అని విజయ్ సేతుపతి వివరించారు.

అసలేం జరిగిందంటే..

కోలీవుడ్‌లో క్యాస్టింగ్ కౌచ్ బాగా ఉందని.. దీనివల్ల తన స్నేహితురాలు ఎంతో ఇబ్బందిపడిందని రమ్య అనే ఓ మహిళ ఎక్స్‌లో పోస్ట్ పెట్టింది. విజయ్ సేతుపతి కూడా ఆమెను ఇబ్బందిపెట్టారని తెలిపింది. తన స్నేహితురాలు మానసికంగా కుంగుబాటుకు గురైందని పోస్ట్‌లో రాసుకొచ్చింది. అయితే ఆమె తన పోస్ట్‌ను కొన్ని గంటల్లో డిలీట్ చేసింది. దీంతో విజయ్ అభిమానులు ఆమెపై విరుచుకుపడ్డారు.

## పాపం.. ఊర్వశి.. మ్యాచ్ కోసం వెళ్తే రూ.70 లక్షలు లాస్!



బాలీవుడ్ భామ ఊర్వశి రౌతేలాకు చేదు అనుభవం ఎదురైంది. ఇటీవల వింబుల్డన్ టోర్నీ చూసేందుకు లండన్ వెళ్లగా తన ఖరీదైన ఆభరణాలు చోరీకి గురైనట్లు పోలీసులకు ఫిర్యాదు చేసింది. లండన్‌లోని గాట్విక్ విమానాశ్రయంలో ఈ సంఘటన జరిగిందని తెలిపింది. దాదాపు రూ.70 లక్షల విలువైన ఆభరణాలు కలిగిన తన లగ్జరీ బ్యాగ్ పోయిందని పోలీసులకు ఫిర్యాదు చేసింది. విమానాశ్రయ అధికారులు ఎలాంటి సహాయం చేయలేదని ఊర్వశి నిరాశ వ్యక్తం చేసింది. విమానాశ్రయం లోని బ్యాగేజ్ బెల్ట్ నుంచి నా లగేజీ చోరీకి గురైందని పేర్కొంది.

ఈ విషయాన్ని తాజాగా సోషల్ మీడియా ద్వారా పంచుకుంది ముద్దుగుమ్మ. ఈ సంఘటనను వివరిస్తూ విమానాశ్రయంలో భద్రతా లోపాన్ని ప్రస్తావించింది. ప్లాటినం ఎమిరేట్స్ సభ్యురాలిగా వింబుల్డన్‌కు గ్లోబల్ ఆర్టిస్ట్‌గా హాజరైనట్లు వెల్లడించింది. ముంబయి నుంచి గాట్విక్ చేరుకోగా.. ఎయిర్‌పోర్ట్‌లో తన బ్యాగ్ దొంగిలించారని పోస్ట్ చేసింది. బ్యాగ్‌తో పాటు టికెట్ వివరాలను సైతం సోషల్ మీడియాలో పంచుకుంది. త్వరగా తన బ్యాగ్ తిరిగొచ్చేలా చర్యలు తీసుకోవాలని స్థానిక పోలీసులకు విజ్ఞప్తి చేసింది. కానీ అక్కడి అధికారుల నుంచి తనకు ఎలాంటి సహకారం అందలేదని వాపోయింది.

కాగా.. ఈ బాలీవుడ్ ముద్దుగమ్మ సినిమాలతో పాటు ప్రత్యేక సాంగ్స్‌తో అభిమానులను అలరించింది. టాలీవుడ్‌లోనూ స్టార్ హీరోల చిత్రాల్లో మెప్పించింది. బాలయ్య, మెగాస్టార్ సినిమాల్లోనూ కనిపించింది.

## బ్యాడ్ టైమ్‌లో నా వెంట ఉన్న ఏకైక వ్యక్తి ఆయనే: సాయి ధరమ్ తేజ్



**మెగా హీరో సాయి ధరమ్ తేజ్(సాయి దుర్గ తేజ్) విరూపాక్ష, బ్రో చిత్రాల తర్వాత గతేడాది మరో మూవీని ప్రకటించారు. ప్రస్తుతం ఈ మూవీతోనే మెగా హీరో బిజీగా ఉన్నారు. ఈ చిత్రాం సాయి ధరమ్ తేజ్ కెరీర్‌లో 18వ సినిమాగా నిలవనుంది. ఈ చిత్రం ద్వారా రోహిత్ కేపీ దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ఈ చిత్రాన్ని ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై కె. నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డి నిర్మిస్తున్నారు.**

ఇక సినిమా సంగతి పక్కనపెడితే సాయి ధరమ్ తేజ్ (సాయి దుర్గ తేజ్) తాజాగా ఓ ఈవెంట్‌కు హాజరయ్యారు. మయసభ పేరుతో వస్తోన్న తెలుగు వెబ్ సిరీస్ ట్రైలర్ లాంచ్ వేడుకలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సాయి ధరమ్ తేజ్ ఆసక్తికర కామెంట్స్ చేశారు. తనతో ఒక సినిమా చేయాలని మయసభ డైరెక్టర్ దేవా కట్టను రిక్వెస్ట్ చేశానని మెగా హీరో అన్నారు. తన బ్యాడ్ టైమ్‌లో నాతో ఉన్న ఏకైక వ్యక్తి ఎవరైనా ఉన్నారా అంటే అది దేవాకట్టా మాత్రమేనని సాయి ధరమ్ తేజ్ తెలిపారు.

సాయి ధరమ్ తేజ్ మాట్లాడుతూ.. 'దాదాపు 10 ఏళ్ల క్రితమే నా జర్నీ దేవాకట్టాతో స్టార్ట్ అయింది. మేమిద్దరం జిమ్‌లో కలిసేవాళ్లం. సార్ నాతో ఒక సినిమా చేయండని రిక్వెస్ట్ చేసేవాడిని. అలా చేస్తే చివరికీ రిపబ్లిక్ మూవీతో జతకట్టాం. నా బ్యాడ్ టైమ్‌లో నాకు వెలుగునిచ్చిన వ్యక్తి దేవాగారు. రిపబ్లిక్ సినిమా టైమ్‌లో నేను ఏదైతే క్లైమాక్స్ కోరుకున్నానో అదే ముందుకు తీసుకెళ్లారు దేవా కట్టా' అని తెలిపారు.

కాగా.. దేవా కట్ట డైరెక్షన్‌లో వస్తోన్న పొలిటికల్ థ్రిల్లర్ వెబ్ సిరీస్ మయసభ. ఈ వెబ్ సిరీస్ ట్రైలర్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు. ఇందులో కృష్ణమ నాయుడు, ఎంఎస్ రామిరెడ్డి పాత్రల్లో ఆది పినిశెట్టి, చైతన్య రావు నటించారు. ఈ వెబ్ సిరీస్ ఆగస్టు 7 నుంచి సోనీ లివ్‌లో స్ట్రీమింగ్ కానుంది.

## ‘హ్రీం’ విజయం సాధించాలి: సందీప్ కిషన్



**పవన్ తాత, చమిందా వర్మ జంటగా నటిస్తోన్న నూతన చిత్రం ‘హ్రీం’. రాజేశ్ రావూరి ఈ చిత్రంతో దర్శకునిగా మారనున్నారు. శివమ్ మీడియా పతాకంపై శ్రీమతి సుజాత సమర్పిస్తున్న ఈ చిత్రానికి శివమల్లాల నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఈ చిత్ర ప్రారంభోత్సవానికి ప్రముఖ హీరో సందీప్‌కిషన్ క్లాప్‌నివ్వగా నటులు అలీ, బెనర్జీ, తెలుగు రాష్ట్రాల్లో టాప్ ఆడిటర్‌గా ఉన్న విజయేంద్రరెడ్డి, సినిజోష్ అధినేత రాంబాబు పర్వతనేని దర్శకుడు రాజేశ్‌కి స్క్రిప్ట్‌ని అందించారు. నటులు రాజీవ్ కనకాల కెమెరా స్విఛాన్ చేశారు.**

చిత్ర ప్రారంభోత్సవం తర్వాత సందీప్ కిషన్ మాట్లాడుతూ-‘‘ నా తొలి చిత్రం నుండి ఈ చిత్ర నిర్మాతతో పరిచయం ఉంది. నాకున్న అతికొద్ది మంది మీడియా ఫ్రెండ్స్‌లో శివ మల్లాల ఎంతో ముఖ్యుడు. ఆయన తీస్తున్న ఈ చిత్రం మంచి విజయం సాధించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నా’’ అన్నారు. నటుడు అలీ మాట్లాడుతూ - ‘హ్రీం’ చిత్ర నిర్మాతలు శివమల్లాల , సుజాతలు నాకు కుటుంబ సభ్యులు. వారు నిర్మించ తలపెట్టిన ఈ చిత్రం మంచి విజయం సాధించాలని దేవుణ్ని ప్రార్థిస్తున్నా’ అన్నారు. నటుడు బెనర్జీ మాట్లాడుతూ-‘‘ ఈ సినిమాలో నేను చాలా మంచి పాత్రలో నటిస్తున్నా. తమ్ముడు శివ నాకు ఎంతో ఆప్తుడు. హీరో, హీరోయిన్ పవన్, చమిందా, దర్శకుడు రాజేశ్‌కి ఆల్ ది బెస్ట్’’ అన్నారు.

రాజీవ్ కనకాల మాట్లాడుతూ- ఈ చిత్రంలో చాలా కీలకమైన పాత్ర పోసిస్తున్నాను. ‘హ్రీం’ చిత్ర హీరోయిన్ చమిందా వర్మ నటే కాదు. దుబాయ్ నుండి తెలుగులో నటించటానికి వచ్చిన తెలుగమ్మాయి. ఆమె డాక్టర్ కూడా. ఈ చిత్రంలో నటిస్తున్న పవన్ తాతా, దర్శకుడు రాజేశ్ నాకు ముందునుండి పరిచయం ఉంది. వారిద్దరికి ఎంతో టాలెంట్ ఉంది. ఇప్పుడు నాకు 50 ఏళ్లు. నాకు 25 ఏళ్లున్నప్పటినుండి ‘హ్రీం’ చిత్ర నిర్మాత శివ మల్లాల నాకు తెలుసు. ఈ సినిమా పెద్ద స్థాయిలో విజయం సాధించాలని కోరుకుంటున్నా’’ అన్నారు.

## హీరో భార్య 'అనొద్దన్న సెలబ్రిటీ వైఫ్'.. మిగిలిన హీరోల భార్యలు..?



ఓ పెద్ద నటుడు, మరీ ముఖ్యంగా అగ్ర హీరోల భార్యలుగా మారడం చాలా మందికి అదృష్టం కావచ్చు అయితే కొందరు మాత్రం కేవలం వారి భార్యలుగా దక్కిన అదృష్టంతో మాత్రమే మిగిలిపోవాలని కోరుకోవడం లేదు. తమను తాము నిరూపించుకోవాలని ఆరాటపడుతున్నారు. అయితే ఈ విషయాన్ని గుర్తించడంలో మన మాధ్యమాలు తరచుగా విఫలమవుతుంటాయి. ఒక పురుషుడిని పెళ్లి చేసుకున్న తర్వాత వంటింటికి మాత్రమే పరిమితమైన గృహిణి ఆకాంక్షలు ఒకలా ఉంటే, పెళ్లి తర్వాత కూడా గడపదాటి తనను తాను నిరూపించుకుంటూ సాగిపోయే వివాహిత ఆకాంక్షలు మరోలా ఉంటాయి అనేది నిర్వివాదం. ఏ వ్యక్తి అయినా తాను సాధించిన విజయాలకు, ప్రత్యేకతలకు తగ్గ వ్యక్తిగత గుర్తింపును ఆశించడం సహజం. దీనికి మగ, ఆడ వ్యత్యాసం లేదు. ఈ నేపథ్యంలో తాజాగా మళయాళ నటుడు ప్రస్తుతం టాప్ పొజిషన్‌లో ఉన్న పృథ్వీరాజ్ సుకుమారన్ భార్య సుప్రియా మీనన్ తాజాగా ఇచ్చిన ఒక సంచలనాత్మక ప్రకటన ప్రస్తావనార్హం.

ప్రసార మాధ్యమాలతో పాటు అనేక మంది తనను తరచుగా పృథ్వీరాజ్ భార్యగా పేర్కొనడాన్ని ఆమె తప్పుబట్టారు. తాను కేవలం ఒక టాప్ హీరో, నటుడు, సినీ ప్రముఖుడు ‘పృథ్వీరాజ్ భార్య‘గా మాత్రమే పరిగణన పొందాలనే దానిని కోరుకోవడం లేదని ఆమె స్పష్టం చేశారు తన స్వంత కెరీర్‌లో ఒక విజయవంతమైన వ్యక్తిగా గుర్తింపు పొందాలని కోరుకుంటున్నానని ఆమె బహిరంగంగానే స్పష్టం చేశారు. ఆమె తనకంటూ స్వంత ఇమేజ్ సృష్టించుకోవాలనే కోరికను వ్యక్తం చేశారు. ఏ మగవాడికి సంబంధించి అయినా ‘అతని భార్య‘, ‘అతని తల్లి‘ లేదా ‘అతని కుమార్తె‘గా తగ్గిపోకూడదని ఆమె అంటున్నారు.

పూర్వ జర్నలిస్ట్, ప్రస్తుత చిత్ర నిర్మాత, పృథ్వీరాజ్ ప్రొడక్షన్స్‌కు సహ యజమాని అయిన సుప్రియా, ‘ఎల్2: ఎంపురాన్‘ వంటి విజయవంతమైన చిత్రాలను నిర్మించారు. ఇవే కాక తన కంటూ స్వంత వృత్తిపరమైన విజయాలు ఉన్నప్పటికీ, నిరంతరం తన భర్త పేరుతోనే గుర్తించబడటం అనేది తనపై ఎలాంటి ప్రభావం చూపుతుందో ఆమె ధైర్యంగా వెల్లడించడం హర్షణీయం.

ఇలా ఒక అగ్రహీరో భార్య బహిరంగంగా వ్యాఖ్యానించడం అనేది నిజంగా ఒక గేమ్ ఛేంజర్ కావచ్చు. మహిళల స్వయం సాధికారత గురించి మాట్లాడే ఉపన్యాసాలు దంచే ఎందరో ప్రముఖులు వారి భార్యలు సాధిస్తున్న విజయాలను తమ సెలబ్రిటీ స్టేటస్ మాటున బలిచేస్తున్న పరిస్థితి ప్రతీ చోటా కనిపిస్తూనే ఉంది. అదే సమయంలో పలువురు నటుల భార్యలు హీరోయిజం అనే షాడో మాటున తమని తాము కోల్పోకుండా వ్యక్తిగత విజయాల కోసం తపిస్తుండడం కనిపిస్తోంది. ఉదాహరణకు టాలీవుడ్ హీరో రామచరణ్ భార్య ఉపాసన, నాగచైతన్య భార్య శోభిత ధూళిపాళ... వంటివారు వ్యక్తిగతంగానూ ఎంతో పేరు ప్రఖ్యాతులు దక్కించుకుంటున్నారు. జీవిత భాగస్వామికి మాత్రమే కాదు తమ కష్టాల ఫలితంగా అందుకున్న తమ వ్యక్తిగత విజయాలకూ గుర్తింపు కోరుకోవడం తప్పు కాదు.. అది.. మహిళ అయినా మగవారైనా..




# చరిత్ర సృష్టించిన శుభ్‌మన్ గిల్.. ఆల్‌టైమ్ రికార్డు బద్దలు

**ఇంగ్లండ్ గడ్డపై ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో టీమిండియా కెప్టెన్ శుభ్‌మన్ గిల్ వరుస పెట్టి రికార్డులు బద్దలు కొడుతున్నాడు. ఈ సిరీస్ ఆరంభం నుంచి భీకర ఫామ్‌లో ఉన్న గిల్.. తాజాగా మరో ఆల్‌టైమ్ రికార్డును బ్రేక్ చేసి చరిత్ర సృష్టించాడు.**

లండన్‌లోని కెన్నింగ్టన్ ఓవల్ మైదానంలో ఇవాళ (జులై 31) ఐదో టెస్ట్ ప్రారంభం కాగా.. భారత్ టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు దిగింది. కష్టమైన పిచ్‌పై తడబడుతూనే బ్యాటింగ్‌కు దిగిన భారత్‌కు ఆదిలోనే భారీ ఎదురుదెబ్బలు తగిలాయి. స్కోర్ 50 పరుగులు కూడా దాటకుండానే ఓపెనర్లు యశస్వి జైస్వాల్ (2), కేఎల్ రాహుల్ (14) పెవిలియన్‌కు చేరారు.

ఈ దశలో బరిలోకి దిగిన గిల్.. ఎంతో సంయమనంగా బ్యాటింగ్ చేస్తూ లంచ్ విరామంలోపు మరో వికెట్ పడకుండా జాగ్రత్తగా ఆడాడు. ఈ క్రమంలో గిల్ సునీల్ గవాస్కర్ పేరిట ఉండిన ఓ ఆల్‌టైమ్ రికార్డును చెరిపేసి చరిత్రపుటల్లో తన పేరును లిఖించుకున్నాడు. 11 పరుగుల వ్యక్తిగత స్కోర్ వద్ద గిల్ ఓ టెస్ట్ సిరీస్‌లో అత్యధిక పరుగులు చేసిన భారత కెప్టెన్‌గా సునీల్ గవాస్కర్ రికార్డును బద్దలు కొట్టాడు.

1978/79 వెస్టిండీస్ సిరీస్‌లో గవాస్కర్ 732 పరుగులు చేయగా.. ప్రస్తుత ఇంగ్లండ్ సిరీస్‌లో గిల్ ఈ రికార్డును తన ఖాతాలో వేసేసుకున్నాడు. ఈ సిరీస్‌లో గిల్ ఇప్పటివరకు 737* పరుగులు చేశాడు. తొలి రోజు లంచ్ విరామం సమయానికి భారత్ స్కోర్ 72/2గా ఉంది. గిల్ (15), సాయి సుదర్శన్ (25) క్రీజ్‌లో ఉన్నారు.

ఓ టెస్ట్ సిరీస్‌లో అత్యధిక పరుగులు చేసిన భారత కెప్టెన్లు

737* శుభ్‌మన్ గిల్ vs ENG, 2025
732 సునీల్ గవాస్కర్ vs WI, 1978/79
655 విరాట్ కోహ్లీ vs ENG, 2016/17
610 విరాట్ కోహ్లీ vs SL, 2017/18
593 విరాట్ కోహ్లీ vs ENG, 2018

కాగా, ఈ మ్యాచ్ కోసం భారత్, ఇంగ్లండ్ జట్లు చెరో నాలుగు మార్పులు చేశారు. భారత్ తరఫున రిషబ్ పంత్, శార్దూల్ ఠాకూర్, బుమ్రా, అన్షుల్ కంబోజ్ స్థానాల్లో ధ్రువ్ జురెల్, కరుణ్ నాయర్, ప్రసిద్ధ్ కృష్ణ, ఆకాశ్‌దీప్ తుది జట్టులోకి రాగా.. ఇంగ్లండ్ తరఫున బెన్ స్టోక్స్, జోఫ్రా ఆర్చర్, బ్రైడన్ కార్స్, లియామ్ డాసన్ స్థానాల్లో జేకబ్ బేతెల్, గస్ అట్కిన్సన్, జోష్ టంగ్, జేమీ ఓవర్టన్ ప్లేయింగ్ ఎలెవెన్‌లోకి వచ్చారు.

ఐదు మ్యాచ్‌ల ఈ సిరీస్‌లో భారత్ 1-2తో వెనుకపడి ఉన్న విషయం తెలిసిందే. ఈ మ్యాచ్‌లో గెలిస్తేనే భారత్ సిరీస్‌ను సమం చేసుకోగలుగుతుంది. ఓడినా, డ్రా అయినా ఇంగ్లండే సిరీస్ ఎగరేసుకుపోతుంది.

**తుది జట్లు..**

భారత్ (ప్లేయింగ్ XI): యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్, సాయి సుదర్శన్, శుభమన్ గిల్ (కెప్టెన్), కరుణ్ నాయర్, రవీంద్ర జడేజా, ధ్రువ్ జురెల్ (వికెట్‌కీపర్), వాషింగ్టన్ సుందర్, ఆకాశ్ దీప్, ప్రసిద్ధ్ కృష్ణ, మహమ్మద్ సిరాజ్



# గత 11 ఏళ్లలో ఒకే ఒక్కడు..!

**కెన్నింగ్టన్ ఓవల్ వేదికగా ఇంగ్లండ్‌తో ఇవాళ (జులై 31) మొదలైన ఐదో టెస్ట్‌లో టీమిండియా ఓపెనర్ కేఎల్ రాహుల్ ఓ అరుదైన ఘనత సాధించాడు. ఈ మ్యాచ్‌లో 40 బంతులు ఎదుర్కొని బౌండరీ సాయంతో 14 పరుగులు చేసి ఔటైన రాహుల్.. ఈ సిరీస్‌లో తానెదుర్కొన్న బంతుల సంఖ్యను వెయ్యి (1000) దాటించాడు.**

తద్వారా గత 11 ఏళ్ల ఓ టెస్ట్ సిరీస్‌లో 1000 బంతులు ఎదుర్కొన్న ఏకైక భారత ఓపెనింగ్ బ్యాటర్‌గా రికార్డుల్లోకెక్కాడు. ఓవరాల్‌గా ఈ ఘనత సాధించిన మూడో భారత ఓపెనర్‌గా నిలిచాడు. రాహుల్‌కు ముందు మురళీ విజయ్, సునీల్ గవాస్కర్ మాత్రమే ఈ ఘనత సాధించారు.

ఇదిలా ఉంటే, ఇంగ్లండ్‌తో ఐదో టెస్ట్‌లో టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు దిగిన భారత్ లంచ్ విరామం సమయానికి 2 వికెట్ల నష్టానికి 72 పరుగులు (23 ఓవర్లలో) చేసింది. సాయి సుదర్శన్ (25), శుభ్‌మన్ గిల్ (15) క్రీజ్‌లో ఉన్నారు.

వర్షం అంతరాయం కలిగించడంతో లంచ్ బ్రేక్‌ను కాస్త ముందుగానే తీసుకున్నారు. వెట్ ఔట్ ఫీల్డ్ కారణంగా లంచ్ తర్వాత కూడా ఆట ఆలస్యమవుతుంది. మ్యాచ్ ప్రారంభానికి ముందు కూడా వరుణుడు అడ్డు తగిలాడు. దీంతో టాస్ కూడా ఆలస్యమైంది.

**ఆదిలోనే ఎదురుదెబ్బలు**

టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు దిగిన టీమిండియాకు ఆదిలోనే ఎదురుదెబ్బలు తగిలాయి. ఓపెనర్లు యశస్వి జైస్వాల్ (2), కేఎల్ రాహుల్ (14) జట్టు స్కోర్ కనీసం 50 పరుగులు కూడా దాటించకుండానే పెవిలియన్‌కు చేరారు. జట్టు స్కోర్ 10 పరుగుల వద్ద జైస్వాల్‌ను అట్కిన్సన్, 38 పరుగుల స్కోర్ వద్ద రాహుల్‌ను క్రిస్ వోక్స్ బోల్తా కొట్టించారు.

**చరిత్ర సృష్టించిన శుభ్‌మన్ గిల్**

ఈ సిరీస్‌లో భీకర ఫామ్‌లో ఉన్న శుభ్‌మన్ గిల్ ఈ ఇన్నింగ్స్‌లో ఓ ఆల్‌టైమ్ రికార్డును బద్దలు కొట్టి చరిత్ర సృష్టించాడు. 11 పరుగుల వ్యక్తిగత స్కోర్ వద్ద ఓ టెస్ట్ సిరీస్‌లో అత్యధిక పరుగులు చేసిన భారత కెప్టెన్‌గా సునీల్ గవాస్కర్ రికార్డును ఛేదించాడు.

1978/79 వెస్టిండీస్ సిరీస్‌లో గవాస్కర్ భారత కెప్టెన్‌గా 732 పరుగులు చేయగా.. ప్రస్తుత సిరీస్‌లో గిల్ 737* పరుగుల వద్ద బ్యాటింగ్‌ను కొనసాగిస్తున్నాడు.

**చెరో నాలుగు మార్పులు**

ఈ మ్యాచ్ కోసం భారత్, ఇంగ్లండ్ జట్లు చెరో నాలుగు మార్పులు చేశాయి. భారత్ తరఫున రిషబ్ పంత్, శార్దూల్ ఠాకూర్, బుమ్రా, అన్షుల్ కంబోజ్ స్థానాల్లో ధ్రువ్ జురెల్, కరుణ్ నాయర్, ప్రసిద్ధ్ కృష్ణ, ఆకాశ్‌దీప్ తుది జట్టులోకి రాగా.. ఇంగ్లండ్ తరఫున బెన్ స్టోక్స్, జోఫ్రా ఆర్చర్, బ్రైడన్ కార్స్, లియామ్ డాసన్ స్థానాల్లో జేకబ్ బేతెల్, గస్ అట్కిన్సన్, జోష్ టంగ్, జేమీ ఓవర్టన్ ప్లేయింగ్ ఎలెవెన్‌లోకి వచ్చారు.

ఐదు మ్యాచ్‌ల ఈ సిరీస్‌లో భారత్ 1-2తో వెనుకపడి ఉన్న విషయం తెలిసిందే. ఈ మ్యాచ్‌లో గెలిస్తేనే భారత్ సిరీస్‌ను సమం చేసుకోగలుగుతుంది. ఓడినా, డ్రా అయినా ఇంగ్లండే సిరీస్ ఎగరేసుకుపోతుంది.

**తుది జట్లు..**

**భారత్ (ప్లేయింగ్ XI): యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్, సాయి సుదర్శన్, శుభమన్ గిల్(కెప్టెన్), కరుణ్ నాయర్, రవీంద్ర జడేజా, ధ్రువ్ జురెల్ (వికెట్‌కీపర్), వాషింగ్టన్ సుందర్, ఆకాశ్ దీప్, ప్రసిద్ధ్ కృష్ణ, మహమ్మద్ సిరాజ్**

**ఇంగ్లండ్ (ప్లేయింగ్ XI): జాక్ క్రాలే, బెన్ డకెట్, ఓలీ పోప్(కెప్టెన్), జో రూట్, హ్యారీ బ్రూక్, జాకబ్ బెథెల్, జామీ స్మిత్(వికెట్‌కీపర్), క్రిస్ వోక్స్, గస్ అట్కిన్సన్, జేమీ ఓవర్టన్, జోష్ టంగ్**



# బుమ్రా ఎంత కాలం ఇలా..! మరో టెస్టుకు దూరమైన పేసర్

టెస్టు బౌలర్‌గా జస్‌ప్రీత్ బుమ్రాపై మరోసారి చర్చ మొదలైంది. సిరీస్ ఫలితాన్ని తేల్చే కీలకమైన టెస్టులో ఆడించకుండా 'పని భారం' పేరుతో అతడిని పక్కన పెట్టడం మళ్లీ అతని ఫిట్‌నెస్‌పై సందేహాలు రేకెత్తించింది. నిజానికి సిరీస్‌కు ముందే అతను మూడు టెస్టులు మాత్రమే ఆడతాడని టీమ్ మేనేజ్‌మెంట్ చేసిన ప్రకటనే తప్పు. ప్రతీ మ్యాచ్‌కు ముందు పరిస్థితిని బట్టి తుది జట్టును ఎంపిక చేసే సమయంలో నిర్ణయం తీసుకోవాల్సింది. కానీ 'మూడే టెస్టులు' అంటూ మళ్లీ మళ్లీ చెప్పడం అర్థరహితం. అలా ప్రకటించినా... పేస్, స్వింగ్‌కు అనుకూలంగా ఉన్న ఓవల్ పిచ్‌పై అతను ఆడతాడని అంతా భావించారు.

ఇంగ్లండ్‌తో నాలుగో టెస్టులో నాలుగు, ఐదు రోజుల్లో బుమ్రాకు బౌలింగ్ చేయాల్సిన అవసరం రాలేదు. మూడు రోజుల విరామం కలిపితే ఐదు రోజుల పాటు అతని పూర్తి విశ్రాంతి లభించింది. లీడ్స్‌తో మొదటి టెస్టు, బర్మింగ్‌హామ్‌లో రెండో టెస్టుకు మధ్య ఏడు రోజుల వ్యవధి వచ్చినా బుమ్రాను ఆడించకపోవడాన్ని మాజీ ఆటగాళ్లు, విశ్లేషకులు తప్పు పట్టగా, ఇప్పుడు అదే పునరావృతమైంది. బుమ్రా అత్యద్భుత బౌలర్ అనడంలో ఎలాంటి సందేహం లేదు. ఒంటి చేత్తో అతను జట్టుకు విజయాలు అందించాడు.

48 టెస్టుల కెరీర్‌లో 35 టెస్టుల్లో విదేశాల్లోనే ఆడి కేవలం 20 సగటుతో 172 వికెట్లు పడగొట్టిన రికార్డు అతని సొంతం. అయితే ఇలా అప్పుడప్పుడు ఆడుతూ 31 ఏళ్ల బుమ్రా ఎంత కాలం టెస్టు కెరీర్‌ను కొనసాగించగలడనేదే చర్చనీయాంశం. టెస్టుల్లో అతను రిటైర్ కావడం మంచిదనే సూచనలు వస్తున్నాయి. అయితే ఇప్పుడు అతను పూర్తిగా తప్పుకోవడంకంటే ఇదే తరహాలో వ్యూహాత్మకంగా వాడుకోవడం సరైందని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. సరిగ్గా చెప్పాలంటే బుమ్రాను నమ్ముకొని మ్యాచ్‌లు గెలవాలనుకునే ఆలోచనను టీమ్ మేనేజ్‌మెంట్ పక్కన పెట్టాల్సిందే.

అతను అందుబాటులో ఉంటే మంచిదే కానీ లేకపోయినా అన్ని రకాలుగా సిద్ధం కావడం సరైన ప్రణాళిక అవుతుంది. ఇతర బౌలర్లతో పోలిస్తే బుమ్రా తక్కువ ఓవర్లు ఏమీ వేయలేదు. ఆస్ట్రేలియా సిరీస్‌లో 151.2 ఓవర్లు వేసిన అతను...ప్రస్తుత సిరీస్‌లో మూడు టెస్టుల్లో 5 ఇన్నింగ్స్‌లోనే 119.4 ఓవర్లు బౌలింగ్ చేశాడు. అతని భిన్నమైన బౌలింగ్ శైలితోనే సమస్య. అదే అతని వెన్ను భాగంపై తీవ్ర ఒత్తిడి పెంచుతుంది.

బౌలింగ్ సమయంలో శరీరాన్ని ఒక వైపు వంచే 'లేటరల్ ఫ్లెక్సియాన్'తో అతను ఇంత కాలం కొనసాగడమే గొప్ప. నిజానికి ఈ సిరీస్‌లో అతను ఆడిన మూడు టెస్టు తొలి ఇన్నింగ్స్‌లలో 140 కిలోమీటర్లకు పైగా వేసిన బంతుల శాతం 42.7 నుంచి 22.3కి, ఆపై 0.5 శాతానికి తగ్గుతూ వచ్చింది. మాంచెస్టర్‌లో ఇన్నింగ్స్‌లో 33 ఓవర్లు వేసిన బుమ్రా తొలిసారి 100కు పైగా పరుగులు ఇచ్చాడు. కాబట్టి అతడిని ఓవల్‌లోనూ ఆడిస్తే సమస్య తీవ్రంగా మారేదేమో! ఇలాంటి స్థితిలో బుమ్రాకు విరామాలు ఇవ్వడంలో తప్పు లేదనేది మేనేజ్‌మెంట్ వాదన.

# గురువును గుర్తు చేసుకుంటూ..

**దివ్య దేశ్‌ముఖ్ భావోద్వేగం**
**స్వస్థలంలో ఘన స్వాగతం**



**నాగ్‌పూర్:** దివ్య దేశ్‌ముఖ్... ప్రస్తుత చెస్ సంచలనం. 19 ఏళ్ల వయసులో మహిళల ప్రపంచకప్‌ను గెలుచుకొని సత్తా చాటిన ఘనాపాటీ. జార్జియాలో జరిగిన ఫైనల్లో కోనేరు హంపిని ఓడించిన అనంతరం చాంపియన్‌గా నిలిచిన అనంతరం దివ్య బుధవారం రాత్రి స్వదేశానికి తిరిగి వచ్చింది. సొంత ఊరు నాగ్‌పూర్ విమానాశ్రయంలో ఆమె తల్లిదండ్రులు, ఇతర కుటుంబ సభ్యులు, సన్నిహితులతో అంతా సందడిగా ఉంది. దివ్య రాగానే వారంతా బాజా భజంత్రీలతో ఆమెకు ఘన స్వాగతం పలికారు.

అప్పుడే దివ్య తన వద్ద ఉన్న ఒక ఫోటో ఫ్రేమ్‌ను బయటకు తీసి ప్రదర్శించింది. అది ఆమె మొదటి కోచ్ రాహుల్ జోషి చిత్రం. దానిని చూపిస్తూ దివ్య భావోద్వేగానికి లోనైంది. చెస్‌లో రాహుల్ వద్దే దివ్య ఓనమాలు నేర్చుకుంది. కేవలం కోచ్‌గానే కాకుండా తన సొంత ఇంట్లో మనిషిగా చూస్తూ రాహుల్ ఆమెకు శిక్షణనందించాడు. కెరీర్ ఆరంభంలో అండర్-9 స్థాయి నుంచి అండర్-14 వరకు పలు విజయాలు రాహుల్ కోచ్‌గా ఉండగానే వచ్చాయి.

ఆమె మరింత ఎదుగుతున్న దశలో 2020లో కరోనా మహమ్మారి వచ్చింది. దీనికి 40 ఏళ్ల వయసులోనే జోషి బలయ్యాడు. కొన్ని విజయాలు సాధించగానే గతాన్ని మరిచిపోయే క్రీడాకారులు మనకు ఎంతో మంది కనిపిస్తుంటారు. కానీ ఆది గురువును ఆమెకు గౌరవించిన తీరు దివ్యను ప్రత్యేకంగా చూపించింది. 'నేను ఈ స్థాయికి చేరడంతో మొదటి కోచ్ రాహుల్ జోషి సర్ పాత్ర ఎంతో ఉంది. నేను గ్రాండ్‌మాస్టర్ కావాలని ఆయన ఎంతో కోరుకునేవారు. ఈ విజయం ఆయనకే అంకితం' అని దివ్య తన మనసులో భావాన్ని వెల్లడించింది.

**నా ఆటపైనే దృష్టి పెట్టాను...**

హంపితో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో తనపై ఎలాంటి ఒత్తిడీ లేదని, తాను ఓడినా కోల్పోయేదేమీ లేదనే ఆలోచనతోనే బరిలోకి దిగినట్లు దివ్య పేర్కొంది. ప్రత్యర్థికి ఎంతో అనుభవం ఉన్నా... దాని గురించి ఆందోళన చెందకుండా తన ఆటపైనే దృష్టి పెట్టానని ఆమె వెల్లడించింది. 'నేను ఓడిపోతాననే ఆలోచన కూడా ఎప్పుడూ రాలేదు. నిజానికి హంపి చేసిన పెద్ద తప్పుతోనే విజయం నా సొంతమైంది. నేను వేయబోయే ఎత్తుల గురించే తప్ప తుది ఫలితం ఎలా వస్తుందని పట్టించుకోలేదు. కాబట్టి ఒత్తిడికి లోను కాలేదు.

అంతర్జాతీయ చెస్‌లో భారత మహిళలు సాధించే విజయాలు ఇక్కడ మరింత మంది అమ్మాయిలు ఈ ఆట వైపు ఆకర్షితులయ్యేందుకు స్ఫూర్తినిస్తాయి. అయితే నా ఉద్దేశం ప్రకారం తల్లిదండ్రుల మద్దతే అన్నింటికంటే అవసరం. ముఖ్యంగా విజయాలు సాధించినప్పుడు కాకుండా ఓటములు ఎదురైనప్పుడు కూడా అండగా నిలవాల్సి ఉంటుంది' అని దివ్య అభిప్రాయ పడింది.

**సెప్టెంబర్ లో తర్వాతి టోర్నీ...**

ప్రపంచకప్‌ను గెలుచుకోవడంతో తనకు దక్కిన కొత్త గుర్తింపు పట్ల దివ్య దేశ్‌ముఖ్ సంతోషం వ్యక్తం చేసింది. మున్ముందు ఇలాంటి విజయాలను కొనసాగిస్తానని ఆమె ఆత్మవిశ్వాసంతో చెప్పింది. స్వస్థలం నాగపూర్‌లో లభించిన ఘన స్వాగతాన్ని ఎప్పటికీ మర్చిపోలేనని దివ్య పేర్కొంది. 'నా కోసం ఇంత మంది ఇక్కడికి రావడం చాలా ఆనందంగా ఉంది. వారంతా నన్ను సన్మానించిన తీరు చూస్తే గర్వంగా అనిపిస్తోంది. నాతో పాటు చెస్‌కు లభించిన గుర్తింపుగా దీనిని భావిస్తున్నాను.

తల్లిదండ్రులు నాకు అండగా నిలిచి ప్రోత్సహించడంతోనే ఇది సాధ్యమైంది. నా విజయంలో వారి పాత్ర గురించి ఎంత చెప్పినా తక్కువే. నెల రోజుల పాటు విశ్రాంతి తీసుకొని మళ్లీ బరిలోకి దిగుతాను. సెప్టెంబర్ 2 నుంచి ఉజ్బెకిస్తాన్‌లో జరిగే గ్రాండ్ స్విస్ నా తర్వాతి టోర్నీ కానుంది' అని దివ్య వెల్లడించింది. తాను వరల్డ్ కప్ గెలుచుకోవడంలో సహకరించిన మాజీ ఆటగాళ్లు, కోచ్‌లు అభిజిత్ కుంతే, అభిమన్యు పురాణిక్, సబా బలోగ్ (హంగేరీ)లకు ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపింది.

# మెకింటోష్ పసిడి 'హ్యాట్రిక్'

**ఫెల్ప్స్ రికార్డుపై కెనడా స్టార్ స్విమ్మర్ గురి**
**మర్చండ్ ఖాతాలో స్వర్ణం**







**సింగపూర్:** ఈత కొలనులో తనకు తిరుగులేదని కెనడా టీనేజ్ స్టార్ స్విమ్మర్ సమ్మర్ మెకింటోష్ మరోసారి చాటుకుంది. ప్రపంచ స్విమ్మింగ్ చాంపియన్‌షిప్‌లో తన జోరు కొనసాగిస్తూ 18 ఏళ్ల మెకింటోష్ మూడో స్వర్ణ పతకాన్ని తన ఖాతాలో జమ చేసుకుంది. గురువారం జరిగిన మహిళల 200 మీటర్ల బటర్‌ఫ్లయ్ ఫైనల్లో మెకింటోష్ 2 నిమిషాల 01.99 సెకన్లలో గమ్యానికి చేరి విజేతగా నిలిచింది. ఈ చాంపియన్‌షిప్‌లో ఇప్పటికే మెకింటోష్ 400 మీటర్ల ఫ్రీస్టయిల్, 200 మీటర్ల వ్యక్తిగత మెడ్లీ విభాగాల్లో బంగారు పతకాలు సొంతం చేసుకుంది.

800 మీటర్ల ఫ్రీస్టయిల్, 400 మీటర్ల మెడ్లీ ఈవెంట్స్‌లో మెకింటోష్ బరిలోకి దిగాల్సి ఉంది. ఈ రెండింటిలోనూ మెకింటోష్ స్వర్ణాలు సాధిస్తే... ఒకే ప్రపంచ చాంపియన్‌షిప్‌లో అత్యధికంగా 5 స్వర్ణ పతకాలు సాధించిన స్విమ్మర్‌గా మైకేల్ ఫెల్ప్స్ (అమెరికా; 2007లో) పేరిట ఉన్న ప్రపంచ రికార్డును మెకింటోష్ సమం చేస్తుంది. గత ఏడాది జరిగిన పారిస్ ఒలింపిక్స్‌లో మెకింటోష్ 200 మీటర్ల బటర్‌ఫ్లయ్, మెడ్లీ, 400 మీటర్ల మెడ్లీ ఈవెంట్స్‌లో స్వర్ణాలు గెలిచి, 400 మీటర్ల ఫ్రీస్టయిల్‌లో రజతం సాధించింది.

2022 ప్రపంచ చాంపియన్‌షిప్‌లో రెండు స్వర్ణాలు, ఒక రజతం, ఒక కాంస్యం నెగ్గిన మెకింటోష్... 2023 ప్రపంచ చాంపియన్‌షిప్‌లో రెండు స్వర్ణాలు, రెండు కాంస్యాలు సాధించింది. మూడోసారి ప్రపంచ చాంపియన్‌షిప్‌లో పోటీపడుతున్న మెకింటోష్ ఇప్పటి వరకు మొత్తం ఏడు స్వర్ణాలు, ఒక రజతం, మూడు కాంస్యాలతో కలిపి

లియా బృందం స్వర్ణ పతకం సొంతం చేసుకుంది. మరో మూడు రోజులపాటు కొనసాగనున్న ఈ మెగా ఈవెంట్‌లో పతకాల పట్టికలో ఆస్ట్రేలియా (5 స్వర్ణాలు, 1 రజతం, 5 కాంస్యాలు) 11 పతకాలతో అగ్రస్థానంలో... అమెరికా (4 స్వర్ణాలు, 10 రజతాలు, 4 కాంస్యాలు) 18 పతకాలతో రెండో స్థానంలో... కెనడా (3 స్వర్ణాలు, 2 కాంస్యాలు) ఐదు పతకాలతో మూడో స్థానంలో ఉన్నాయి. గెలిచిన స్వర్ణాల సంఖ్య ఆధారంగా ర్యాంకింగ్‌ను నిర్ణయిస్తారు.